


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 333, పేజీలు - 08

శనివారం, మే 23, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

# అంతా రేవంత్ గుప్పెట్లోనే!

## - ఆయన చెప్పిందే రైట్.. రైట్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని తన చేతుల్లోకి తీసుకున్నారు. కాంగ్రెస్ లో ప్రస్తుతం నడిచేదంతా రేవంత్ దే. ఆయన హవా ముందు మరే నేత లేకుండా పోతున్నారు. రేవంత్ కు కూడా కాంగ్రెస్ నాయకత్వం పూర్తి స్థాయి స్వేచ్ఛనిచ్చిందని అంటున్నారు. హైకమాండ్ ఆదేశాలతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నిర్ణయాలను యథేచ్ఛగా, స్వేచ్ఛగా తీసుకుంటున్నారని చెబుతున్నారు. సాధారణంగా కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అంతే స్థాయిలో స్వపక్షంలో విపక్షం కూడా బలంగా ఉంటుంది. కానీ తెలంగాణలో మాత్రం అంతా ఏకపక్షంగానే నడుస్తుందన్నది వాస్తవం. అది నేతలతో పాటు క్యాడర్ కూడా అంగీకరిస్తున్న విషయం. అందుకే రేవంత్ రెడ్డి పదేళ్లు తానే ముఖ్యమంత్రినని ధైర్యంగా చెప్పుకుంటున్నారు.

### ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా..

కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనైనా సరే అక్కడ ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా మరొకవర్గం ఖచ్చితంగా ఉంటుంది. కర్ణాటకలో సిద్ధరామయ్యకు వ్యతిరేకంగా డీకే శివకుమార్ వర్గం నిరంతరం పనిచేస్తుంటుంది. హైకమాండ్ కు వెళ్లి సిద్ధరామయ్యపై ఫిర్యాదు చేస్తుంది. కానీ రేవంత్ రెడ్డి విషయంలో మాత్రం రివర్స్ లో ఉంది. అసమ్మతి నేతలకు ఢిల్లీ లోటెన్ జన్ పథ్ గేట్లు తెరుచుకునే పరిస్థితులు లేవంటున్నారు. తాను తీసుకునే ప్రతి నిర్ణయాన్ని రాహుల్ తో చెప్పి రేవంత్ చేస్తుండటమే ఇందుకు కారణమని, తాను అటువంటి నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలను కూడా రాహుల్ చెప్పి రేవంత్ ఒప్పిస్తుండటంతోనే అసమ్మతి గళానికి అక్కడ ఛాన్స్ లేకుండా పోయిందంటున్నారు.

### పదవుల పంపిణీలోనూ..

పదవుల పంపిణీలోనూ, పార్టీ విషయంలో నియామకాల్లోనూ రేవంత్ రెడ్డిదే పైచేయి.
పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ నామమాత్రంగానే మారిపోయారు. రేవంత్ చెప్పిన సూచనలను పార్టీ నేతలకు చేరవేయడమే మీనాక్షి పని అని ఒక సీనియర్ నేత వ్యాఖ్యానించడం విశేషం. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయి రెండున్నరేళ్లు గడుస్తున్నప్పటికీ ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా వాయిస్ వినిపించే వారు లేరు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కొంత కాలం ఎగిరెగిరి పడినా తర్వాత పరిస్థితులను అర్థం చేసుకుని ఆయన కూడా సైలెంట్ అయ్యారంటున్నారు.

మొత్తం మీద ప్రస్తుతం కాంగ్రెస్ లో రేవంత్ రెడ్డి ఏం చెబితే అది జరుగుతుంది. అందుకే నేతలు రేవంత్ ను కలసి ఆయనను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారన్నది పార్టీలో ఇన్నర్ వర్గాల టాక్.

# ఐఏఎస్‌ల పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకు.?

## - సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు

- విద్యా, ఆర్థిక ఎదుగుదలతో సామాజిక మార్పు
- రిజర్వేషన్ల నుంచి తరం మారాలని సూచన
- క్రీమీ లేయర్ మినహాయింపులపై కోర్టు విచారణ
- ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నవారికి కోటాపై అసంతృప్తి



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశంలో రిజర్వేషన్లపై సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. వెనుకబడిన తరగతులలో (బీసీ) ఆర్థికంగా, విద్యాపరంగా ఉన్నత స్థానాలకు చేరుకున్న కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను నిరంతరం పొడిగించడంపై పలు ప్రశ్నలను లేవనెత్తింది. కోటా ద్వారా సామాజిక పురోగతి సాధించిన కుటుంబాలు, కాలక్రమేణా రిజర్వేషన్ వ్యవస్థ నుంచి వెలుపలికి రావాలని కోర్టు మౌఖికంగా అభిప్రాయపడింది. ఫలాలు అందుకుని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నతస్థితికి చేరిన కుటుంబాలు అదే కోటాను తరతరాలుగా కోరుకోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. "తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్‌లై.. ప్రభుత్వ సర్వీసుల్లో కొనసాగి స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా అవసరమా?"

2లో..

# బండి భగీరథ్ విషయంలో సీఎం, కేంద్రమంత్రి తోడు దొంగలు

## - సీఎం రేవంత్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేసిన కేటీఆర్

- బండి సంజయ్ లొంగుబాటు అంటే, రేవంత్ రెడ్డి అరెస్టు అంటున్నారని ఆగ్రహం
- ఇద్దరు తోడు దొంగలు కలిసి డ్రామాలు ఆడుతున్నారని విమర్శ
- రేవంత్ రెడ్డికి హైట్ మాత్రమే తక్కువ కాదు బుర్ర కూడా తక్కువ అని ఎద్దేవా



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బండి భగీరథ్ లొంగిపోయాడని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ చెబితే, పోలీసులే అరెస్టు చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆయన లొంగుబాటు అంటే, ఈయన అరెస్టు అని చెప్పడం విడ్డూరమని అన్నారు. ఇద్దరు తోడు దొంగలని, వారు కలిసి డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డికి హైట్ ఒక్కటే తక్కువ అనుకున్నానని, కానీ బుర్ర కూడా తక్కువేనని ఎద్దేవా చేశారు. బండి భగీరథ్‌కు ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు చేశారని, కానీ హైకోర్టులో అనుకూలంగా తీర్పు రాలేదని కేటీఆర్ తెలిపారు. పోక్సో కేసు నిందితుడిని 9 రోజులు దాచిపెట్టిందెవరో చెప్పాలని డిమాండ్ చేశారు. తాము పోరాడకుంటే బాలిక కుటుంబానికి న్యాయం జరిగేది కాదని, తమ పోరాటం, న్యాయవ్యవస్థ వల్లే బాధితులకు న్యాయం జరిగిందని కేటీఆర్ చెప్పారు. ఒక అమ్మాయికి అన్యాయం జరిగితే ఆ అమ్మాయి వివరాలు బయటపెట్టింది బీజేపీవారే అన్నారు. పేట్ బషీరాబాద్‌లో 15 మందిపై కేసులు నమోదయ్యాయని, వారంతా బీజేపీవారే అన్నారు.

### పంట కొనుగోళ్లపై శ్వేతపత్రం విడుదల చేయాలి

భూములు, భూదోపిడీ మీద పెట్టిన శ్రద్ధ రైతుల మీద పెట్టాలి కేటీఆర్ హితవు పలికారు. ఈ ప్రభుత్వం వచ్చాక కోటిన్నర టన్నుల పంట వస్తే సగం కూడా కొనలేదని మండిపడ్డారు. పంటల కొనుగోళ్లపై ఈ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్

2లో..

# భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్

## - విద్యుత్ వినియోగంపై ప్రజలకు కేంద్రం కీలక సూచనలు

- దేశవ్యాప్తంగా భారీగా నమోదవుతోన్న ఉష్ణోగ్రతలు
- వరుసగా నాలుగు రోజుల నుంచి అధిక డిమాండ్
- రోజూ 2 నుంచి 4 గంటల మధ్య ఎక్కువ వినియోగం




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** సూపర్ ఎల్‌నినో.. వాతావరణ మార్పులు, వాయువ్య వేడి గాలులు వెరసి ఈ వేసవిలో భారత్ భగ్గుమంటోంది. ఇల్లు దాటి బయటకొస్తేనే కాదు ఇళ్లలోనూ ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దేశవ్యాప్తంగా ప్రచండ భానుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలతో బయటకు రావాలంటేనే జనం భయపడిపోతున్నారు. ఓవైపు అధిక ఉష్ణోగ్రతలు, వేడి గాలులు, ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దీంతో దేశంలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరుకుంది.

2లో..

# అవసరమైతే ఆ ప్రాంతాల్లో సెలవులు ఇవ్వండి

## - రాష్ట్రంలో ఎండల తీవ్రత, వడగాల్పులపై సీఎం చంద్రబాబు సమీక్ష - చలివేంద్రాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఆదేశం - తీవ్ర ఉష్ణోగ్రతలున్న ప్రాంతాల్లో స్థానికంగా సెలవులు ప్రకటించాలని సూచన



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. భానుడు భగభగమంటూ ప్రజలపై విరుచుకుపడుతున్నాడు. దీంతో ప్రజలు ఇంట్లో నుంచి బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. ఈనెల 26 వరకు ఏపీలో భారీగా ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. అంతేకాదు ప్రతీ రోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు అని వాతావరణ శాఖ ప్రభుత్వం పలు సూచనలు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా రాష్ట్రంలో తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలు, వడ గాలుల నుంచి రక్షణ పొందేందుకు సన్నద్ధత చర్యల పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. భారీ ఉష్ణోగ్రతలు, తీవ్ర వడగాల్పులపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

### ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటే సెలవులు ప్రకటించండి

తీవ్ర వడగాల్పుల నేపథ్యంలో పరిస్థితిని ఎదుర్కోనేలా ఎక్కడికక్కడ టెంట్లు, చలివేంద్రాలు, చల్లని నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలు ఉన్న ప్రాంతాల్లో స్థానికంగా శెలవులు ప్రకటించేలా చూడాలని సీఎం దిశానిర్దేశం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎండల

2లో..

# హైదరాబాద్‌లో వాటర్ ట్యాంకర్లకు రికార్డు స్థాయిలో డిమాండ్

- నిల్వ కోసం ముందస్తు బుకింగ్!
- మే 20వ తేదీ నాటికి 2.60 లక్షల ట్యాంకర్ల నీటి సరఫరా



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో ప్రజలు అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అధిక ఉష్ణోగ్రతకు తోడు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. భానుడి భగభగ కారణంగా నగరంలో తాగునీటి వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. దీంతో జలమండలి నీళ్ల ట్యాంకులకు కూడా డిమాండ్ భారీగా పెరిగింది. చాలా ప్రాంతాల్లో వాటర్ ట్యాంకులను ముందస్తుగా బుక్ చేసుకుంటున్నారు.

2లో..

# విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి రాజీనామా

## - ప్రభుత్వంపై అసంతృప్తే కారణమా.?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ విద్యా రంగంలో సంస్కరణల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ పదవికి మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి రాజీనామా చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పదవి చేపట్టిన కొద్ది నెలలకే ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక ప్రభుత్వ పెద్దలతో ఏర్పడిన విభేదాలే ప్రధాన కారణమని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

2లో..

# కిడ్నీ మార్పిడిలో నిమ్స్ రికార్డు

## - 2000 ఆపరేషన్లు పూర్తి చేసి దేశంలో మూడో స్థానం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఆస్పత్రిలోని డాక్టర్ల బృందంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసలు గుప్పించారు. కిడ్నీ మార్పిడి ఆపరేషన్ల విషయంలో నిమ్స్ ఆస్పత్రి సాధించిన విజయాన్ని సీఎం అభినందించారు. కిడ్నీ

3లో..

# ఇది దార్శనికత, నమ్మకం, వేగానికి ప్రతిరూపం

## - రూ.3 వేల కోట్ల ఎస్ఏఈఎల్ సోలార్ ప్రాజెక్టు ప్రారంభం

- మా బ్రాండ్ ఉద్యోగాల కల్పన అయితే, మీ బ్రాండ్ గొడ్డలి అంటూ పరోక్ష విమర్శలు
- రికార్డు స్థాయిలో కేవలం 11 నెలల్లోనే 600 మెగావాట్ల ప్రాజెక్టు పూర్తి
- బ్రాండ్ చంద్రబాబు, డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే అభివృద్ధి పరుగులు పెడుతోందని వెల్లడి



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఒక ప్రాజెక్టు ప్రారంభమవ్వడమంటే కేవలం రిబ్బన్ కటింగ్ కాదని, అది దార్శనికత, నమ్మకం, వేగం, కార్యనిర్వహణల కలయిక అని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. శుక్రవారం జమ్మలమడుగు నియోజకవర్గం, కొండాపురం మండలం టి.కొండూరు గ్రామంలో రూ.3,000 కోట్లతో నిర్మించిన సుఖ్ బీర్ ఆగ్రో ఎనర్జీ లిమిటెడ్ (ఎస్ఏఈఎల్) వారి 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లోకేష్ మాట్లాడుతూ, "మా నాన్న

2లో..

# వడ్డీ లేని రుణాలు రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంపు

## - బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతలను ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం మహాత్మాజ్యోతి రావు పూలే ప్రజాభవన్ లో జరిగిన 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ 20147 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం కృతనిశ్చయంతో

2లో..

## విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి రాజీనామా

అయితే ఆయన తన పని పూర్తి అయిందని అందుకే రాజీనామా చేశానని అంటున్నారు.

### ఇప్పటికే నివేదిక సమర్పించిన విద్యా కమిషన్

ఆకునూరి మురళి నేతృత్వంలోని తెలంగాణ విద్యా కమిషన్ సుమారు 14 నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి, విదేశీ విద్యా విధానాలను అధ్యయనం చేసిన తర్వాత ఎడ్యుకేషన్ పాలసీ ఫర్ తెలంగాణ 2026 – విజన్ ఫర్ ఇన్‌క్లూజివ్ ఎక్సలెన్స్ పేరుతో సమగ్ర నివేదికను సిద్ధం చేసింది. ఫిబ్రవరి 2026లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమర్పించింది.

### నిధుల కేటాయింపు, మౌలిక సదుపాయాలు

రాష్ట్ర విద్యా బడ్జెట్‌ను ప్రస్తుతమున్న స్థాయి నుంచి 18 శాతానికి పెంచాలని కమిషన్ సిఫార్సు చేసింది. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2,000 ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా మార్చి, వాటిలో ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా ల్యాబ్‌లు, లైబ్రరీలు, స్పోర్ట్స్ సౌకర్యాలు , బస్సు కనెక్టివిటీ కల్పించాలని ప్రతిపాదించింది. విద్యార్థుల ఒత్తిడిని తగ్గించేందుకు 11వ తరగతి అంటే ఇంటర్ ప్రథమ సంవత్సరం బోర్డు పరీక్షలను రద్దు చేయాలని కీలక సూచన చేసింది.

### ఉపాధ్యాయుల జవాబుదారీతనం

టీచర్ల విషయంలో కమిషన్ చాలా కఠినమైన సంస్కరణలను ప్రతిపాదించింది. ఇకపై ఉపాధ్యాయులకు ఆటోమేటిక్ ప్రమోషన్లు ఉండకూడదని, ప్రతి ఐదేళ్లకోసారి వారి పనితీరును సమీక్షించాలని పేర్కొంది. ఒకవేళ పనితీరు బాగోలేకపోతే, మెరుగుపరుచుకోవడానికి రెండేళ్ల సమయం ఇచ్చి, అప్పటికీ మార్పు రాకపోతే వారిని సర్వీస్ నుంచి తొలగించాలని సిఫార్సు చేసింది. అయితే, ఈ నిబంధనలు కేవలం భవిష్యత్తులో నియమితులయ్యే కొత్త టీచర్లకే వర్తిస్తాయని స్పష్టం చేసింది.

### యూనివర్సిటీలు , ప్రైవేట్ స్కూళ్ల నియంత్రణ

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 80 శాతానికి పైగా బోధనా పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, 86 శాతం కాలేజీలకు ఎన్ఏఏసీ గ్రేడింగ్ లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ప్రైవేట్ స్కూళ్ల ఫీజులను అదుపు చేసేందుకు ఒక స్టాట్యూటరీ ఫీజు రెగ్యులేటరీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, అలాగే ఐఐటీ–జేఈఈ, నీట్ కోచింగ్ సెంటర్లు మరియు హాస్టళ్ల పర్యవేక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని నివేదికలో పేర్కొంది. రాజీనామా లేఖలో ఆకునూరి మురళి ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను పూర్తి చేశాను, అందుకే తప్పుకుంటున్నాను అని ప్రకటించినప్పటికీ, ఈ విప్లవాత్మక సిఫార్సులను అమలు చేసే విషయంలో ప్రభుత్వ వైఖరిపై ఆయనకు ఏవైనా అసంతృప్తి ఉందా అనే చర్చ ప్రస్తుతం విద్యా వర్గాల్లో సాగుతోంది.

## ఇది దార్శనికత, నమ్మకం,
# వేగానికి ప్రతిరూపం

ఉత్తరం రాశారు, మా తాత కల కన్నారు, నేను ఆత్మలతో మాట్లాడాను అంటే ఇప్పుడు నమ్మేవాళ్ళు ఎవరూ లేరు బ్రదర్. మా బ్రాండ్ జాబ్ క్రియేషన్ అయితే... మీ బ్రాండ్ గొడ్డలి" అంటూ పరోక్షంగా విమర్శలు గుప్పించారు.

### రాష్ట్రం చూపు.. జమ్మలమడుగు వైపు

రికార్డు సమయంలో ఎస్ఏఈఎల్ ప్రాజెక్టు పూర్తి కావడం స్థానిక రైతుల, జమ్మలమడుగు యువత విజయమని లోకేష్ ప్రశంసించారు. "మీ సహకారం వల్లనే ఈ భారీ ప్రాజెక్టు కేవలం 11 నెలల్లో పూర్తయింది. ఈరోజు రాష్ట్రం మొత్తం జమ్మలమడుగు వైపు చూస్తోంది. ఇక్కడ మెగా సోలార్ పార్క్, అదానీ, చింతా గ్రీన్, జెన్‌కో––ఎన్టీపీసీ పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులతో పాటు ఇప్పుడు ఎస్ఏఈఎల్ ను కూడా తీసుకువచ్చింది మనమే. కంపెనీలు తేవాలన్నా, ఉద్యోగాలు కల్పించాలన్నా అది బ్రాండ్ సీబీఎన్‌కే సాధ్యం" అని లోకేష్ అన్నారు.

### విజయానికి మూడు సూత్రాలు

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పన విజయవంతం కావడానికి మూడు ముఖ్య కారణాలు ఉన్నాయని లోకేష్ వివరించారు. "మొదటిది –– బ్రాండ్ సీబీఎన్. ఇచ్చిన మాటను నిలబెట్టుకునే నాయకత్వం ఉండటంతో పెట్టుబడిదారులు ఏపీ వైపు చూస్తున్నారు. రెండవది –– స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. వేగంగా నిర్ణయాలు తీసుకుని, ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడం మా విధానం. ఈ ప్రాజెక్టే దానికి నిదర్శనం. మూడవది –– డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ మద్దతుతో రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెడుతోంది" అని ఆయన పేర్కొన్నారు.

### ప్రపంచంతో పోటీపడే ఎకోసిస్టమ్ నిర్మాణం

ఆంధ్రప్రదేశ్‌లో ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, సాఫ్ట్‌వేర్, డ్రోన్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో 22 ప్రత్యేక గ్రోత్ క్లస్టర్లను నిర్మిస్తున్నామని లోకేష్ తెలిపారు. "ఆధునిక ఆర్థిక వ్యవస్థకు ఆవిష్కరణలే కీలకం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి భవిష్యత్తు కోసం ప్రపంచంతో పోటీపడే ఎకోసిస్టమ్‌లను నిర్మిస్తున్నాయి" అని ఆయన వివరించారు.

### ఎస్ఏఈఎల్ తో తొలి పరిచయం

ఎస్ఏఈఎల్ సంస్థతో తన తొలి పరిచయాన్ని లోకేష్ గుర్తుచేసుకున్నారు. "ఢిల్లీలో ఒక టెలికాం ఆపరేటర్ల సమావేశంలో ఎస్ఏఈఎల్ నాయకత్వాన్ని కలిశాను. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులపై వారికున్న ఉత్సాహం, దీర్ఘకాలిక ప్రణాళిక నన్ను ఆకర్షించింది. వారి తపనను నేను వెంటనే గ్రహించగలిగాను" అని ఆయన నాటి సంఘటనను వివరించారు.

### స్థానిక సమాజంతో మమేకం

పంజాబ్ కేంద్రంగా పనిచేసే ఒక కంపెనీ ఏపీలో విజయవంతం కాగలదా అనే సందేహం మొదట కలిగిందని, కానీ ఎస్ఏఈఎల్ బృందం క్షేత్రస్థాయిలో స్థానిక సమాజంతో మమేకమై పనిచేయడం చూశాక ఆ సందేహం తొలగిపోయిందని లోకేష్ అన్నారు. "వారు రైతులు, గ్రామస్థులు, అధికారులు, కార్మికులతో కలిసికట్టుగా పనిచేసి, వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని ముందుకు సాగారు. ఆ స్ఫూర్తే ఈ ప్రాజెక్టు విజయానికి కారణం," అని ఆయన ప్రశంసించారు.

### రికార్డు వేగంతో ప్రాజెక్టు పూర్తి

ఎస్ఏఈఎల్ సంస్థ రూ.3,000 కోట్ల పెట్టుబడితో, 2,400 ఎకరాల విస్తీర్ణంలో రెండు భారీ 300 మెగావాట్ల ప్రాజెక్టులను కేవలం 11 నెలల్లో పూర్తి చేసి రికార్డు సృష్టించిందని లోకేష్ తెలిపారు. పంజాబ్, రాజస్థాన్‌లోని ఎస్ఏఈఎల్ సొంత ప్లాంట్లలో తయారైన 12 లక్షలకు పైగా అత్యాధునిక సోలార్ మాడ్యూళ్లను ఈ ప్రాజెక్టులో వినియోగించారు.

### పర్యావరణ పరిరక్షణ, విద్యుత్ ఎగుమతి

ఈ ఒక్క ప్రాజెక్టుతోనే ఏటా సుమారు 11 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను నివారించవచ్చని అంచనా. ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను 25 ఏళ్ల ఒప్పందం ప్రకారం సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా జాతీయ గ్రిడ్‌కు సరఫరా చేస్తారు. "ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు కేవలం క్లీన్ ఎనర్జీని వినియోగించడమే కాదు, దేశానికి ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతోంది. భారతదేశ హరిత ఇంధన విప్లవానికి ఏపీ నాయకత్వం వహించడానికి సిద్ధంగా ఉంది," అని లోకేష్ స్పష్టం చేశారు. ఎస్ఏఈఎల్ బృందాన్ని ఉద్దేశించి "తుస్సీ కమాల్ కర్ దిట్టా.. చక్ దే ఫట్టే!" అంటూ పంజాబీలో అభినందించారు.

### ఉపాధి, భవిష్యత్ భరోసా

ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే 1,000 మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించిందని, వీరిలో 80 శాతం స్థానికులేనని లోకేష్ చెప్పారు. 760 మంది రైతులకు దీర్ఘకాలిక లీజు ఒప్పందాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. వ్యవసాయ వ్యర్థాల నుంచి కూడా విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రాజెక్టులను ఎస్ఏఈఎల్ చేపడుతోందని, దీనివల్ల రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఎస్ఏఈఎల్ సంస్థకు ఎలాంటి మద్దతు కావాలన్నా తాను ఒక వాట్సాప్ కాల్ దూరంలోనే ఉంటానని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, సవిత, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్ఏఈఎల్ కో–ఫౌండర్ సుఖ్ భీర్ సింగ్, సీఈవో లక్షిత్ ఆవ్లా, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, టీడీపీ ఇంఛార్జ్ భూపేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ం

## ఐపీఎస్‌ల పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకు.?

అని సుప్రీం కోర్టు పలు ప్రశ్నలు సంధించింది. ఓబీసీ క్రిమీలేయర్ (ధనికవర్గం) పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ బీవీ నాగరత్న మాట్లాడుతూ విద్య, ఆర్థిక సాధికారకత ద్వారా సమాజంలో ఒక స్థాయి వస్తుందని పేర్కొన్నారు. "తల్లిదండ్రులిద్దరూ ఐఏఎస్ అధికారులు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడి ఉన్నతస్థానానికి చేరుకుని, వారిలో సామాజిక పురోగతి స్పష్టంగా కనిపిస్తోంది. ఇటువంటి వారందరినీ రిజర్వేషన్ల నుంచి మినహాయిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయి. కానీ, ఆ మినహాయింపులను వారు సవాలు చేస్తున్నారు. ఈ విషయాన్ని కూడా మనం మనసులో ఉంచుకోవాలి రిజర్వేషన్ల ద్వారా ప్రయోజనం పొంది ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత కూడా వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరైంది కాదు ఇలాగైతే రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి మనం ఎప్పటికీ బయటపడలేం దీనిని తీవ్రంగా పరిగణించాల్సి ఉంది" అని జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానించారు. ఈ కేసులో పిటిషనర్ల తరపున హాజరైన సీనియర్ లాయర్ శశాంక్ రత్నూ సదరు వ్యక్తులను వారి జీతం ఆధారంగా కాకుండా, వారి హోదా ఆధారంగా మినహాయించారని తెలిపారు. దీనిపై లోతైన పరిశీలన అవసరమని, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కేటగిరీకి, క్రిమీలేయర్‌కు మధ్య స్పష్టమైన తేడా ఉండాలని కోరారు. దీనికి జస్టిస్ నాగరత్న స్పందిస్తూ ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో సామాజిక వెనుకబాటుతనం ఉండదని, కేవలం ఆర్థిక వెనుకబాటుతనం మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. అయితే, లాయర్ శశాంక్ ఈడబ్ల్యూఎస్ కంటే క్రిమీలేయర్ పరిమితి నిబంధనలు చాలా సరళంగా ఉండాలని, రెండింటినీ ఒకేలా చూస్తే వాటి మధ్య తేడా లేకుండా పోతుందని వాదించారు. "సామాజికంగా, విద్యాపరంగా ఒక వ్యక్తి వెనుకబడి ఉండొచ్చు కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుంది.. ఇక్కడ ఒక సమతౌల్యత అవసరం" అని కోర్టు ఉద్ఘాటించింది. అన్ని అవకాశాలను ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే చేజిక్కించుకుంటే, అదే వర్గంలోని నిరు పేదలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. సమాజంలో కేవలం కొందరికే రిజర్వేషన్ల ఫలాలు పరిమితం కాకూడదని, అట్టడుగున ఉన్న వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఇదిలా ఉండగా, 1992 నాటి 'ఇంద్ర సాహ్ని' (మండల్ కమిషన్) కేసులో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ల కోటాను సమర్థిస్తూనే, వారిలో 'క్రిమీలేయర్' వర్గాలను మినహాయించాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ప్రస్తుతం రూ. 8 లక్షల వార్షికాదాయంతో పాటు.. రాజ్యాంగబద్ధమైన ఉన్నత పదవుల్లో ఉన్నవారు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి సీనియర్ అధికారులు, సైనికాధికారుల పిల్లలకు ఆదాయంతో సంబంధం లేకుండా క్రిమీలేయర్‌గా పరిగణించి రిజర్వేషన్ల కోటా నుంచి మినహాయిస్తున్నారు. ఈ మినహాయింపులను సవాల్ చేస్తూ పలువురు సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ కేసులో కేంద్రం, ఇతర సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేసిన సుప్రీం కోర్టు తదుపరి విచారణను వాయిదా వేసింది. రాబోయే రోజుల్లో క్రిమీలేయర్ నిబంధనలపై ఇచ్చే తీర్పు రిజర్వేషన్ల కోటాలో మరిన్ని సంస్కరణలకు దారితీసే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## బండి భగీరథ్ విషయంలో సీఎం, కేంద్రమంత్రి తోడు దొంగలు

చేశారు. రైతులను ఇలాగే నిర్లక్ష్యం చేస్తే బీఆర్ఎస్ పోరాటాలకు దిగుతుందని ఆయన హెచ్చరించారు. రైతు సమస్యలే ఏకైక అజెండాగా మంత్రివర్గ సమావేశం జరగాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనటం లేదని రైతులు రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నారన్న కేటీఆర్, అన్నదాతలే కాకుండా కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ధర్నా చేస్తున్నారన్నారు. సీఎం సొంత నియోజకవర్గంలో కూడా రైతులు గురువారం ధర్నా చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. మంచిర్యాల జిల్లాలో నలుగురు రైతులు చనిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎండలో రైతులు పడిగాపులు కాస్తున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనటం లేదని ఒకరిద్దరు రైతులు పురుగుల మందు సేవించారన్నారు. కొన్నిచోట్ల ఎండల తీవ్రతతో ధాన్యం కుప్పల మీదే రైతులు చనిపోయారన్నారు. రాష్ట్రంలో 35 శాతానికి మించి ధాన్యం కొనుగోలు జరగలేదని కేటీఆర్ అన్నారు. ఈ ప్రభుత్వానికి ఏ విషయంలోనూ ప్రణాళిక లేకుండా పోయిందని చెప్పారు. పంటలు కొనడం లేదు రైతులకు యూరియా దొరకటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు డిక్లరేషన్లో 34 హామీలు ఇచ్చారన్న కేటీఆర్, వాటిలో ఒక్కటీ అమలు కాలేదని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వం రైతుబంధును ఇప్పటికే నాలుగుసార్లు ఎగవేసిందన్నారు. భేషజాలకు పోకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్

ఈ నేపథ్యంలో కేంద్ర విద్యుత్ శాఖ ప్రజలకు కీలక సూచనలు చేసింది. రోజురోజుకు తీవ్రమవుతోన్న ఉష్ణోగ్రతల కారణంగా విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగిందని పేర్కొంది. ముఖ్యంగా పగటి సమయంలో వినియోగం రికార్డు స్థాయికి చేరుకుందని విద్యుత్‌ను జాగ్రత్తగా వాడుకోవాలని సూచించింది. మే 21న గురువారం దేశవ్యాప్తంగా పగలు గరిష్ట విద్యుత్ డిమాండ్ 270.82 గిగావాట్ల గరిష్ఠస్థాయికి చేరుకుందని తెలిపింది. తీవ్రమైన ఎండ, ఉక్కపోత కారణంగా వరుసగా నాలుగు రోజుల పాటు విద్యుత్ వినియోగం మునుపటి రికార్డులను అధిగమించిందని పేర్కొంది. మే 18న గరిష్ఠ డిమాండ్ 257.37 గిగావాట్లుగా కాగా మే 19న 260.45 గిగావాట్లకు చేరుకోగా మే 20న 265.44 గిగావాట్లు, మే 21న 270.82 గిగావాట్లకు పెరుగుతూ సరికొత్త రికార్డుల నమోదుచేసినట్టు పేర్కొంది. రోజూ మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్య అధిక ఉష్ణోగ్రతలతో డిమాండ్ ఎక్కువగా ఉందని, ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వినియోగం విపరీతంగా పెరిగిపోతోందని కేంద్ర విద్యుత్ శాఖ తెలిపింది. దీనివల్ల సరఫరా వ్యవస్థలు, గ్రిడ్ నిర్వహణపై ఒత్తిడి పెరిగి, విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉంటోందని పేర్కొంది. విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతున్నప్పటికీ పరిస్థితి నియంత్రణలోనే ఉందని వెల్లడించింది. దేశవ్యాప్తంగా విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొంది. శుక్రవారం గరిష్ఠ డిమాండ్‌లో థర్మల్ విద్యుత్ 62.8%, సౌరశక్తి 22.0%, పవన శక్తి 5.0%, జల శక్తి 5.8%, మిగిలింది ఇతర వనరుల నుంచి వచ్చినట్టు తెలిపింది. థర్మల్ విద్యుత్ ప్లాంట్ల వద్ద బొగ్గు లభ్యత, సరఫరా సమర్థవంతంగా ఉందని తెలిపింది.

## అవసరమైతే ఆ ప్రాంతాల్లో సెలవులు ఇవ్వండి

తీవ్రత, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేలా జిల్లా కలెక్టర్లు మీడియా సమావేశాలు నిర్వహించాలని సూచిచారు. సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, విపత్తు నిర్వహణ, వైద్యారోగ్య, పురపాలక, పంచాయితీరాజ్ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

### ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం

ఆంధ్రప్రదేశ్‌లో సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఓ వైపు తీవ్రమైన ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంటే మరోవైపు వడగాలులు హడలెత్తిస్తున్నాయి. ఈ క్రమంలో చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అంతా నానా నరకయాతన అనుభవిస్తున్నారు. జనం ఇంటి నుంచి కనీసం 10 నిమిషాలపాటు బయటకు వెళ్లాలంటేనే భయపడిపోయే పరిస్థితి నెలకొంది. తప్పనిసరిగా ఉద్యోగాలు, పనులకు వెళ్లేవారు మినహా మిగిలిన వారంతా ఇళ్లకే పరిమితం అవుతున్నారు. రాత్రివేళల్లోనూ వేడి తగ్గడం లేదు. విపరీతమైన చెమటలతో జనాలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

### దక్షిణ కోస్తాలో 8 జిల్లాలకు రెడ్ అలర్ట్

కోస్తాంధ్రలో ఈ నెల 26వ తేదీ వరకూ ప్రచండ ఎండలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. మరో ఐదురోజులపాటు అతి తీవ్రమైన వడగాలులు, దక్షిణ కోస్తాలో అత్యధిక వేడి వాతావరణం ఉంటుందని తెలిపింది. ఈ క్రమంలో దక్షిణ కోస్తాలో 8 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. మరో 6 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, మూడు జిల్లాలకు ఎల్లో అలర్ట్ ఇచ్చింది. శ్రీకాకుళం, విజయనగరం మినహా అన్ని జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ సీజన్‌లో బాపట్లలో సాధారణంకంటే 7.4 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైనట్లు వెల్లడించింది.

### తెలంగాణలోనూ ప్రచండ ఎండలు

మరోవైపు తెలంగాణలోనూ మే 26 వరకు ప్రచండ ఎండలు తప్పవని వాతావరణ శాఖ పేర్కొంది. రాష్ట్రంలో తీవ్ర వడగాలులు వీస్తాయని, ఖమ్మం, పెద్దపల్లి జిల్లాల్లో హీట్ వేవ్ మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఖమ్మం, పెద్దపల్లి జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. కొన్ని జిల్లాల్లో మాత్రం తేలికపాటి వర్షాలు కురుస్తాయని రెండు మూడ్రోజుల్లో నైరుతి రుతుపవనాలు విస్తరిస్తాయని చెప్పింది. మరోవైపు యూపీ–ఛత్తీస్ గఢ్– ఒడిశా మీదుగా ద్రోణి కొనసాగుతోంది అని వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావంతో పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించింది.

## హైదరాబాద్‌లో వాటర్ ట్యాంకర్లకు రికార్డు స్థాయిలో డిమాండ్

నగరంలో మే నెల మొదటి 20 రోజుల్లో సుమారు 2.60 లక్షల ట్యాంకర్ల నీటిని సరఫరా చేసినట్లు జలమండలి తెలిపింది. ప్రస్తుతం వారం రోజులుగా రోజుకు సగటున 12 వేలకు పైగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. సాధారణంగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో ఎక్కువ ట్యాంకర్లకు డిమాండ్ ఉండేది. మే నెలలో కాస్త తగ్గేది. కానీ ఈసారి ఇందుకు భిన్నంగా మే నెలలో ఎక్కువ ట్యాంకుల కోసం బుక్ చేసుకున్నారు. గత సంవత్సరం మే నెలలో మొదటి 20 రోజుల్లో 1.69 లక్షల నీటి ట్యాంకర్లకు డిమాండ్ ఉండగా, ఈసారి 2.60 లక్షల ట్యాంకర్లతో నీటి సరఫరా జరిగింది. వర్షాలు పడి, వాతావరణం కాస్త చల్లబడేవరకు నీటి ట్యాంకర్ల బుకింగ్ ఇదేవిధంగా ఉండవచ్చని భావిస్తున్నారు. గత మూడేళ్లను పరిశీలిస్తే 2024 మే 20వ తేదీ నాటికి 1,18,191 ట్యాంకర్లు, 2025 అదే కాలంలో 1,69,347 ట్యాంకర్లు నీటిని సరఫరా జరిగింది. పెట్రోల్, డీజిల్ కొరత ఆందోళనలు తలెత్తినప్పుడు వాహనదారులు బంకుల వద్ద క్యూకట్టి ముందస్తుగా భద్రపరుచుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇటీవల గ్యాస్ సిలిండర్ కొరత భయాలతోనూ ప్రజలు గ్యాస్ కోసం వేగంగా బుకింగ్ చేసి, ఇంట్లో భద్రపరుచుకున్నారు. అదనపు గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేయడంతో అవసరమైన వారికి దొరకకుండా పోయింది. ఇప్పుడు ఇదే కోవలో హైదరాబాద్‌లో నీటిని కూడా ముందస్తుగా బుకింగ్ చేసి భద్రపరుచుకుంటున్నారు. కొంతమంది అవసరం లేకపోయినా ట్యాంకర్లను బుక్ చేసుకుని నీటిని నిల్వ చేసుకుంటున్నారు. గత రెండేళ్లతో పోలిస్తే ఈ ఏడాది నీటి కొరత, ట్యాంకర్ల బుకింగ్‌లో అత్యధికస్థాయికి చేరుకున్నాయి.

## వడ్డీ లేని రుణాలు రూ.5 లక్షల నుంచి
# రూ. 10 లక్షలకు పెంపు

పనిచేస్తోందని చెప్పుకొచ్చారు.

### తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వ్యవసాయం

రాష్ట్రంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు దాదాపు రూ.9.43 లక్షల కోట్లకు చేరుకోవడం... అడ్వాన్సులు రూ.12.34 లక్షల కోట్లకు చేరుకోవడం గొప్ప విషయమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. రాష్ట్రం 130.78 శాతం క్రెడిట్–డిపాజిట్ నిష్పత్తితో ముందుకు సాగడం అద్వితీయ విషయని ఆయన చెప్పారు. వ్యవసాయ రుణాల విషయంలో లక్ష్యాలను మించి బ్యాంకులు రుణాలు ఇవ్వడం సంతోషకరమని అన్నారు. రూ.1,65,297 కోట్ల లక్ష్యానికి గాను రూ.1,68,401 కోట్ల వ్యవసాయ రుణాలు పంపిణీ చేసి 101.88 శాతం సాధించడం గర్వించదగ్గ విషయంగా చెప్పారు. వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. రైతులు, పాడి రైతులు, మత్స్యకారులు మరియు అనుబంధ రంగాలకు కిసాన్ క్రెడిట్ కార్డు సహా వివిధ పథకాల ద్వారా బ్యాంకులు అందిస్తున్న మద్దతు అభినందనీయం అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు.

### అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం తెలంగాణ

తెలంగాణ రాష్ట్రం పారిశ్రామిక రంగంలో దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళ, దళిత, గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై బ్యాంకులు మరింత దృష్టి పెట్టాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులకు ఇచ్చే రుణాల విషయంలో బ్యాంకులు మరింత సానుకూల దృక్పథంతో ముందుకు రావాలని ఆయన చెప్పారు. విద్యార్థులకు ఇచ్చే రుణాలు యువతపై మనం పెట్టే భవిష్యత్ పెట్టుబడి అని ఆయన చెప్పారు. సంక్షేమం–అభివృద్ధి రెండింటిని జోడెడ్లుగా పరుగులు తీయగలవని ప్రజాప్రభుత్వం చేతల్లో నిరూపించిందని అన్నారు. సమగ్రాభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, ఉపాధి సృష్టి పట్ల మా ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు.

### సౌరశక్తి విభాగంలో స్థిరమైన ప్రగతిని సాధిస్తున్నాం

నేడు ప్రపంచమంతా పునరుత్పాదక ఇంధనరంగంపై దృష్టి సారిస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అందులో భాగంగా ప్రజాప్రభుత్వం కూడా సౌరశక్తి (సోలార్ పవర్) విభాగంలోస్థిరమైన ప్రగతిని సాధిస్తోందన్నారు. సౌరశక్తి ప్రాజెక్టులు, రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు మరియు ఇతర పర్యావరణ అనుకూల కార్యక్రమాలకు బ్యాంకులు చురుగ్గా రుణ సహాయం అందించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. సామాజిక భద్రత, బీమా పథకాల పరిధిలోకి రాష్ట్ర ప్రజలను తీసుకురావాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బ్యాంకులు కేవలం డబ్బు డిపాజిట్ చేసే, రుణాలు ఇచ్చే ఆర్థిక సంస్థలుగానే కాకుండా, రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధి భాగస్వాములుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రజల డబ్బు అంతా బ్యాంకులకే చేరుతుంది, కాబట్టి ఆ నిధులను ఏ రంగాల అభివృద్ధికి రుణాలుగా ఇస్తున్నామనేది చాలా ముఖ్యం. రాష్ట్ర ఆర్థిక వృద్ధికి (జీఎస్డీపీ), ఉపాధికి ఏ రంగం ఎక్కువ దోహదపడుతుందో ఆలోచించి బ్యాంకులు వ్యూహాత్మకంగా రుణాలు అందించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు.

### తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలి

'ప్రజాప్రభుత్వం 2047 ఆర్థిక సంవత్సరం నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది పెద్ద కల. తెలంగాణ ప్రస్తుత వృద్ధి రేటు చూస్తుంటే ఇది ఖచ్చితంగా సాధ్యమే'అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశ సగటు వృద్ధి రేటు 8.2% గా ఉంటే, తెలంగాణ వృద్ధి రేటు 10.7% తో దూసుకుపోతోందని చెప్పారు. దేశ సగటు తలసరి ఆదాయం రూ.2.1 లక్షలుగా ఉంటే, తెలంగాణ తలసరి ఆదాయం రూ.4.18 లక్షలతో దేశంలోనే అగ్రగామిగా ఉందని డిప్యూటీ సీఎం ప్రకటించారు. తెలంగాణ ప్రజాప్రభుత్వం మూసీ నది పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం అత్యంత వేగంగా పూర్తి చేయడంకూడా ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించుకుని ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణలో వేగంగా పట్టణీకరణ జరుగుతోందని అన్నారు. ఈ నేపథ్యంలో సేవల రంగాని అధిక అవకాశాలు ఉంటాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు

### మహిళా వ్యాపారులు ఎదిగేందుకు హైదరాబాద్ మంచి అవకాశం

మహిళా ఆర్థిక సాధికారత కోసం రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల వడ్డీ లేని రుణాలు రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఈ సంవత్సరం హైదరాబాద్ నగరంలో మహిళా సంఘాలకు రుణ పంపిణీ యుద్ధప్రాతిపదికన దృష్టి సారించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. హైదరాబాద్ నగరం మహిళలకు వ్యాపార రంగంలో, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల్లో ఎదగడానికి ఎన్నో అవకాశాలను ఇస్తోందని చెప్పారు. నగరంలోని మురికివాడల్లోని యువ మహిళా పారిశ్రామికవేత్తలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో త్వరలోనే అనేక ఇండస్ట్రియల్ హబ్‌లు, క్లస్టర్లను తీసుకువస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగా ఫార్మా, ఫ్యాబ్ సిటీ, స్టీల్, లెదర్, టెక్స్‌టైల్ వంటి వివిధ రంగాలను డిజైన్ చేస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పుకొచ్చారు. ఈ బ్యాంకర్ల సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ దాన కిషోర్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఫైనాన్స్ – ప్లానింగ్ సెక్రెటరీ గౌరవ్ ఉప్పల్, ఆర్బీఐ రీజనల్ డైరెక్టర్ చిన్మయ మోహన్, ఎస్బీఐ సీజీఎం నీలేష్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని-1 క్షిపణి ప్రయోగం సక్సెస్

### – రైలు నుంచి ప్రయోగించే సామర్థ్యం సాధించిన భారత్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత రక్షణ రంగం మరో కీలక మైలురాయిని అధిగమించింది. స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి 'అగ్ని–1'ను శుక్రవారం విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి వ్యూహాత్మక బలగాల కమాండ్ (ఎస్ఎఫ్‌సీ) ఆధ్వర్యంలో ఈ ప్రయోగం జరిగింది. ఈ పరీక్షలో క్షిపణికి సంబంధించిన అన్ని కార్యాచరణ, సాంకేతిక పారామితులను విజయవంతంగా ధృవీకరించినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, భారత్ ఇటీవలే క్షిపణి ప్రయోగాల్లో సరికొత్త సామర్థ్యాన్ని సాధించింది. గతేడాది సెప్టెంబర్ 24న, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్డీవో), ఎస్ఎఫ్‌సీ సంయుక్తంగా 'అగ్ని–ప్రైమ్' క్షిపణిని రైలు ఆధారిత మొబైల్ లాంచర్ నుంచి విజయవంతంగా ప్రయోగించాయి. దేశంలో ఈ తరహా ప్రయోగం జరగడం ఇదే ప్రథమం. ఈ అగ్ని–ప్రైమ్ క్షిపణి 2,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. రైల్ నెట్‌వర్క్‌పై దేశంలో ఎక్కడికైనా వేగంగా తరలించి, శత్రువుల కంటపడకుండా చాలా తక్కువ సమయంలో ప్రయోగించే సౌలభ్యం ఈ రైల్ మొబైల్ లాంచర్ ప్రత్యేకత. ఈ విజయవంతమైన ప్రయోగంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. డీఆర్డీఓ, ఎస్ఎఫ్‌సీ, సాయుధ బలగాలను ఆయన అభినందించారు. రైల్ నెట్‌వర్క్ నుంచి క్షిపణిని ప్రయోగించే వ్యవస్థను అభివృద్ధి చేసిన కొద్ది దేశాల సరసన భారత్ నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే రోడ్ మొబైల్ అగ్ని–పి క్షిపణి సైన్యంలో సేవలందిస్తుండగా, ఈ కొత్త సామర్థ్యం దేశ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయనుంది.

# బెజవాడలో జీప్‌లతో ఢీకొట్టుకొన్న యువకులు

**- పరుగులు తీసిన జనం**

**- యువతి వ్యవహారంలో మనస్పర్థలే కారణం**



ఎదురెదురుగా దూసుకొస్తూ...వారిద్దరూ చిన్ననాటి నుంచి ప్రాణ స్నేహితులు. ఓ యువతి వ్యవహారంలో మనస్పర్థలు తలెత్తాయి. ఇది కాస్త ముదిరి.. నడిరోడ్డుపై వాహనాలతో ఢీకొట్టుకునే వరకు వెళ్లింది. అవి ధ్వంసమైనా.. పగ, కసి చల్లారక.. దిగి కలియబడ్డారు. ఈ ఘటన చూసి.. రోడ్డుపై వెళ్తున్న వారు భయంతో పరుగులు పెట్టారు. ఫ్యాక్షన్ సినిమాలోని పతాక సన్నివేశాలకు ఏమాత్రం తీసిపోని ఈ ఘటన విజయవాడలో హైటెన్షన్ రోడ్డులో గురువారం రాత్రి జరిగింది..సవాళ్లు విసురుకుని.. తాడిగడపకు చెందిన లింగమనేని రోహిత్ ఇంజినీరింగ్ విద్యార్థి.విజయవాడలోని భారతీనగర్‌కు చెందిన బోల్లా ఓమ్.. తన తండ్రితో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చూసుకుంటున్నాడు. ఇతను వైకాపా నేత జోగి రమేష్‌కు బంధువుగా చెప్పుకొనేవాడు. జగన్ పుట్టిన రోజును కూడా తాడేపల్లిలో తాను చదివే ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఘనంగా చేశాడు. వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించాడు. ఓమ్, రోహిత్ ఇద్దరూ చిన్ననాటి నుంచి స్నేహితులు. ఓ యువతి వ్యవహారంలో ఇద్దరి మధ్య వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో రోహిత్‌కు ఓమ్ ఫోన్ చేశాడు. ఎక్కడ ఉన్నావని ప్రశ్నించాడు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. తాను పటమట ఆర్ఆర్ గార్డెన్‌లోని హైటెన్షన్ రోడ్డులో ఉన్నానని చెప్పాడు. ఇద్దరు ఒకరికొకరు సవాళ్లు విసురుకున్నారు. ఒకదానికొకటి ఢీకొట్టుకుంటూ..ఓమ్.. తన థార్ జీప్‌పై రోహిత్ ఉన్న ప్రాంతానికి గురువారం రాత్రి వెళ్లాడు. రోహిత్ జీప్‌ను ఢీకొట్టాడు. ఆగ్రహంతో ఇద్దరూ పరస్పరం రోడ్డుపైనే పలుసార్లు ఒకరి వాహనాన్ని మరొకరు బలంగా ఢీకొట్టుకున్నారు. ఇలా ఢీకొట్టుకుంటూ సుమారు 100 మీటర్లు రోడ్డుపై ఈడ్చుకుంటూ హడావుడి చేశారు. యాక్షన్ సీన్లను తలపించేలా ఢీకొట్టుకున్నారు. ఆ సమయంలో రోడ్డుపై వాకింగ్ చేస్తున్న వారు, అటుగా వెళ్తున్న ప్రజలు.. భీతావహ దృశ్యాలను చూసి భయాందోళనలతో పరుగులు తీశారు. అప్పటికీ ఇద్దరూ వెనక్కి తగ్గలేదు. జీప్‌లు దిగి రాడ్లతో మళ్లీ కారు అద్దాలను పగలకొట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి సమీపంలోని పటమట పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు వచ్చే సరికి జీప్‌ను వదిలేసి రోహిత్ పరారయ్యాడు. ఓమ్‌ను స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్‌కిషోర్ తెలిపారు. గొడవ జరిగినప్పుడు ఒకరి వాహనంలో ఓ యువతి, మరో వాహనంలో కొందరు యువకులు ఉన్నట్లు తెలిసింది.

## అర్ధరాత్రి వేళ నిఘా మరింత పటిష్టం

**- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



**జగిత్యాల** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు రాత్రి వేళ నిఘాను మరింత బలోపేతం చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక చర్యలు, దొంగతనాలు తదితర ఘటనలను అరికట్టేందుకు బ్లూ కోల్ట్స్, పెట్రోకార్ వాహనాలతో నిరంతర గస్తీ నిర్వహించడంతో పాటు నైట్ బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో నిన్న అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో జిల్లా ఎస్పీ జగిత్యాల, కోరుట్ల, మేడిపల్లి ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి పెట్రోలింగ్ విధానాన్ని స్వయంగా పరిశీలించారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. రాత్రి వేళల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ? రాత్రి సమయంలో సమర్థవంతమైన పెట్రోలింగ్ నిర్వహించడం ద్వారా ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడమే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు. సమయానుకూలంగా స్పందిస్తూ నేరాలకు ముందుగానే అడ్డుకట్ట వేయవచ్చని తెలిపారు. ముఖ్యంగా దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక చర్యలను నియంత్రించేందుకు రాత్రి నిఘాను మరింత పటిష్టం చేశామని పేర్కొన్నారు.జిల్లాలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేందుకు అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకుంటున్నామని, ఎలాంటి అనుమానాస్పద ఘటనలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పోలవరంలో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ పర్యటన

ఆంధ్ర ప్రదేశ్ జలవనరుల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ పోలవరం ప్రాజెక్టులో శుక్రవారం పర్యటించారు. గురువారం రాత్రి పోలవరం ప్రాజెక్ట్ అతిథి గృహంలో బస చేసిన ఆయన ఉదయాన్నే పర్యటన ప్రారంభించారు. పోలవరం ప్రాజెక్ట్ స్పిల్ వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యాములు, డయాఫ్రమ్ వాల్, ఫిష్ లాడెర్ మొదలైన వాటిని ఆయన పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యామ్ పనులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. పనుల పురోగతిని ఆయన అడిగి తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్ట్ జల విద్యుత్ కేంద్రం పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్ట్, జల విద్యుత్ కేంద్రం పనుల పురోగతి తదితర అంశాలపై శశిభూషణ్ కుమార్ సమీక్షించనున్నారు. కొద్దీ రోజుల క్రితం శశిభూషణ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే.

శశిభూషణ్ వెంట పర్యటనలో పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సి ఈ ఓ సంజీవ్ వోహ్రా, చీఫ్ ఇంజనీర్ కే రమేష్ బాబు, ఆంధ్ర ప్రదేశ్ జలవనరుల శాఖ సలహాదారు ఎం వెంకటేశ్వర రావు, చీఫ్ ఇంజనీర్ కే నరసింహమూర్తి, ఎస్ ఈ ఆర్ రామచంద్ర రావు, నిర్మాణ సంస్థ జి ఎంలు ఏ గంగాధర్, ప్రసేన్జిత్ మజుందార్, డీజీఎం మురళి పమ్మి తదితరులు ఉన్నారు.

### వైకాపా సానుభూతిపరులని

# ఉపాధీ పనులివ్వడంలేదు

**పిఠాపురం** పిఠాపురంలో ఉపాధి హమీ పనుల కల్పనలో దారుణం జరిగింది. వైసీపీ సానుభూతిపరులు అనే కారణంగా ఉపాధి కూలీలకు ఫీల్డ్ అసిస్టెంట్ వీరబాబు ఇవ్వలేదని పలువురు కూలీలు ఆరోపించారు. జనసేన నేతల ఒత్తిళ్ల వల్లే పని ఇవ్వలేకపోతున్నాని అయన కూలీలకు వెల్లడించారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఘటన జరిగింది. పేదల పొట్టకూటిపై రాజకీయాలు ఏంటంటూ ఉపాధి కూలీల ఆగ్రహం వ్యక్తం చేసారు. పని ప్రదేశం వద్దే ఆందోళనకూలీలు చేపట్టిట్ఆరు. తరువాత వైకాపా నేతలు లు ఉన్నతాధికారులతో మాట్లాడి పని కల్పించారు.

## హోం మంత్రి అనిత ఇలాకాలో దారుణం

**అనకాపల్లి** హోం మంత్రి అనిత ఇలాకాలో దళిత మైనర్ బాలికపై అత్యాచారం జరిగింది. 7వ తరగతి చదువుతున్న మైనర్ బాలిక (11)ను కాళ్ళు, చేతులు కట్టేసి అత్యాచారం చేసారు. నిందితులు చిన్నబ్బాయి, జోగి రాజుపై పాయకరావుపేట పీఎస్లో పోక్సో కేసు నమోదు అయింది. 17వ తేదీన ఘటన జరిగింది. .. విషయం ఎవరికైనా చెబితే బాధితురాలిని చంపేస్తామని బెదిరింపులకు గురిచేసారు. బాధిత బాలిక తల్లి ఈనెల 20వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది. హోంమంత్రి నియోజకవర్గం కావడంతో కేసు వివరాలు బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి.

## కొందుర్గ్ పీఎస్‌ను తనిఖీ చేసిన సీపీ తరుణ్ జోషి



**హైదరాబాద్** ఫ్యూచర్ సిటీ కమిషనర్ డా. తరుణ్ జోషి కొందుర్గ్ పోలీస్ స్టేషన్లో ఆకస్మిక తనిఖీ జరిపారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలపై ప్రత్యేకంగా ఆరా తీసారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని పోలీసులకు ఆదేశం ఇచ్చారు. చట్ట అమలులో కఠినంగా ఉండాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. స్టేషన్కు వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెరిగేలా విధులు నిర్వహించాలని సూచాంచారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరూ ఎక్కువగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

### మచిలీపట్నంలో బయటపడ్డ

# కామర్స్ లెక్చలర్ కామ లీలలు

**- నిరుద్యోగ యువతికి ఉద్యోగం ఇప్పిస్తానని ఆశ చూసి లోబర్చుకునేందుకు ప్రయత్నం**

**- కామ లెక్చరర్ దురాగతాన్ని బట్ట బయలు చేసిన భార్య**

**మచిలీపట్నం** గతంలో మచిలీపట్నంలోని ఓ మహిళా కాలేజీలో లెక్చరర్ గా పనిచేసి ప్రస్తుతం అవనిగడ్డ లోని ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్ గా పనిచేస్తున్న జాషువా, ఉద్యోగ వేటలో ఉన్న యువతి నిస్సహాయతను అదునుగా చేసుకుని లోబరుచుకునే ప్రయత్నాలు చేసాడు. మచిలీపట్నం గొడుగు పేటలోని ఓ దేవాలయానికి సమీపంలో ఇంటిని అద్దెకి తీసుకుని ఉద్యోగం కావాలంటే తన కోరిక తీర్చాలంటే యువతిని లోబరుచుకునే ప్రయత్నం చేసాడు. విషయం తెలుసుకుని భార్య అద్దె ఇంట్లో ఉంటున్న భర్తను తుక్కు రేగేల కొట్టింది. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య వివాదాలు రావడంతో అవనిగడ్డలోని ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తూ బందరు ప్రాంతంలో ఇంటిని అద్దెకి తీసుకొని అధ్యాపకుడు జాషువా నివాసం వుంటున్నాడు. మహిళలకు ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మాయమాటలతో మభ్యపెట్టి లోపర్చుకుంటూ వికృత చేష్టలను చేపడుతున్నాడని భార్య ఆరోపణ. కామర్స్ లెక్చరర్ గా పనిచేసే జాషువా తో తనకు 25 సంవత్సరాల క్రితం వివాహం జరిగిందని... వేరే మహిళలతో అక్రమ సంబంధాలను కొనసాగిస్తూ తనతో గొడవలు పడుతూ ఉండేవాడని ఆరోపించింది. మోసపూరిత వైఖరితో మహిళల జీవితాలతో ఆడుకుంటున్న తన భర్త పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

# ఇంద్రకీలాద్రిపై భక్తుల కోలాహలం

**- సేవా పథంలో చైర్మన్ మరియు అధికారులు**

**విజయవాడ,** ఇంద్రకీలాద్రిపై వేసవి సెలవులు మరియు శుక్రవారం కావడంతో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ, అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థాన చైర్మన్ శ్రీ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) మరియు ఇన్-చార్జ్ ఈఓ శ్రీ రంగారావు గారు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.ముఖ్య అంశాలు:క్యూలైన్ల పర్యవేక్షణ: చైర్మన్ శ్రీ బొర్రా రాధాకృష్ణ మరియు ఈఓ శ్రీ రంగారావు గారు రోజంతా భక్తుల మధ్యే ఉండి, క్యూలైన్లను స్వయంగా పర్యవేక్షించారు. భక్తులతో ముచ్చటిస్తూ వారి సమస్యలను తెలుసుకుని, దర్శనం సాఫీగా సాగేలా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకున్నారు.అంతరాలయ దర్శనం నిలిపివేత: భక్తుల రద్దీ అసాధారణంగా పెరగడంతో, సాధారణ భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించే ఉద్దేశంతో ఉదయం 10 గంటల నుండి అంతరాలయ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. దీనివల్ల క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు అమ్మవారి దర్శనం వేగంగా లభించింది.వేసవి ఉపశమన చర్యలు: ఎండ వేడి నుండి భక్తులను రక్షించేందుకు క్యూలైన్లలో చల్లని మజ్జిగ, శుద్ధి చేసిన తాగునీటిని నిరంతరాయంగా పంపిణీ చేశారు. ఎక్కడా నీటి కొరత లేకుండా దేవస్థాన సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు.అన్నప్రసాద వితరణ: భక్తుల సౌకర్యార్థం రోజంతా ఉచిత అన్నప్రసాద వితరణ మరియు పులిహోర ప్రసాదాల పంపిణీ కొనసాగింది. భక్తులు సంతృప్తి చెందేలా నాణ్యమైన భోజన సదుపాయం కల్పించారు.ట్రస్ట్ బోర్డ్ సభ్యుల సేవలు: ధర్మకర్తల మండలి (ట్రస్ట్ బోర్డ్) సభ్యులు కూడా సామాన్య భక్తుల సేవలో నిమగ్నమయ్యారు.

### దళిత వర్గాల ఉన్నతికి పాటుపడిన

# గొప్ప వ్యక్తి మాదరి భాగ్యరెడ్డి వర్మ

**నిర్మల్** శుక్రవారం ఉదయం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో భాగ్యరెడ్డి వర్మ 138 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, పలువురు అధికారులతో కలిసి భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజంలోని అసమానతలను తొలగించేందుకు జీవితాంతం పాటుపడిన గొప్ప వ్యక్తి భాగ్యరెడ్డి వర్మ అని అన్నారు. దళిత బాలికల కోసం నాటి నిజాం కాలంలోనే 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించారని గుర్తుచేశారు. కుల వివక్షత నిర్మూలన, మూఢనమ్మకాలపై చైతన్యం, దేవదాసీ వ్యవస్థ నిర్మూలన, మద్యపాన నిషేధం, బాలిక విద్యా, అనేక విషయాల్లో ప్రజలను చైతన్యం చేశారని గుర్తు చేశారు. ఆది హిందూ సోషల్ లీగ్ సంస్థను ఏర్పరిచి జాతుల మధ్య అంతరాలు తొలగించారని తెలిపారు. భాగ్యరెడ్డి వర్మ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నేటి యువత భాగ్యరెడ్డి వర్మను మార్గదర్శకంగా తీసుకోవాలని సూచించారు. సమాజంలో విశిష్ట మార్పులకు కృషిచేసిన మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలు ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయం అని చెప్పారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా గొప్ప వ్యక్తుల విశేషాలను నేటి తరాలకు అందించిన వారమఅవుతామని తెలిపారు. ఈ జయంతి వేడుకల్లో జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ శంకర్, బిసి, ఎస్టీ మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు శ్రీనివాస్, అంబాజీ, మోహన్ సింగ్, సిపిఓ జీవరత్నం, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, జిల్లా పౌర సంబంధాల అధికారి విష్ణువర్ధన్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 18 కిలో మీటర్లు సైకిల్ తొక్కిన మంత్రి నిమ్మల

**అమరావతి** రెండో వారం నో వెహికల్ డే సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడ పాలకొల్లు నుండి ట్రైన్ లో సాధారణ ప్రయాణికులతో కలసి విజయవాడ చేరుకున్నారు. రామవరప్పాడు రైల్వే స్టేషన్ నుండి మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయం వరకు సైకిల్ తొక్కారు. మంత్రి సుమారు 18 కిలోమీటర్లు సైకిల్ తొక్కారు. వరుసగా 2వ వారం కూడా నో వెహికల్ డే సందర్భం గా సైకిల్ తొక్కారు. తాడేపల్లి దగ్గర మంత్రి నిమ్మల కు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ స్వాగతం పలికారు. ఒకే సైకిల్ పై పార్టీ కార్యాలయానికి మంత్రి నిమ్మల, పల్లా శ్రీనివాస్ వచ్చారు.మంత్రి మాట్లాడుతూ జగన్ ఒక పిచ్చి తుగ్లక్. జగన్ మావిగన్ అంటే కూటమి భయపడటం లేదు...ప్రజలే భయపడుతున్నారు. అధికారం కోసం జగన్ ఎంతకైనా తెగిస్తాడు. హత్య రాజకీయాలు జగన్ కి అలవాటు. అమరావతి లో జరుగుతున్న పనులు చూసి జగన్ కి భయం మొదలుఅయింది. అందుకే అమరావతి పై జగన్ విషం కక్కుతున్నాడు. జగన్ మళ్ళీ సీఎం అయితే పొట్టేలు తలల స్థానంలో ప్రజల తలలు నరుకుతాడు. వచ్చే ఎన్నికల్లో జగన్ కి 11 సీట్లు కుడా రావని అన్నారు.

## అభిషేక సేవలో సామాన్య భక్తులకు అవకాశం

**తిరుమల** తిరుమలలో మరో రికార్డ్ బ్రేక్ సృష్టించారు టిటిడి అదనపు ఈవో వెంకయ్య... శుక్రవారం రోజున స్వామివారికి నిర్వహించే అభిషేక సేవలో సామాన్య భక్తులకు అవకాశం కల్పించేలా సంచలన నిర్ణయం తీసుకున్నారు...గత కొద్ది రోజులుగా తిరుమల కొండకు భక్తుల పోటెత్తిన నేపథ్యంలో... క్యూలైన్లు భక్తులు గంటల తరబడి వేచివున్న అంశాన్ని దృష్టిలో ఉంచుకొని శుక్రవారం రోజున స్వామివారికి నిర్వహించే అభిషేక సేవకు సంబంధించిన సేవలో టిటిడి జారీ చేసే డిస్టింక్షనరీ కోటాను కుదించి సామాన్య భక్తులు మరింత మంది భక్తులు శ్రీవారిని దర్శించుకునే విధంగా నిన్న రాత్రి టిటిడి ఆలయ అధికారులతో సంప్రదింపులు జరిపి ఇవాళ ఉదయం ఆ విధానాన్ని అమలు చేసినట్లు వెంకయ్య చౌదరి తెలిపారు... తద్వారా ఇవాళ ఉదయం శ్రీవారి అభిషేక సేవ సమయంలో దాదాపు 5,850 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అయన వివరించారు...గత వారం రోజులుగా రోజుకు 75 వేల నుంచి 91 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్నారని చెప్పారు... శుక్రవారం రోజున 79 వేల మంది స్వామి వారిని దర్శించుకోవాడం మరో రికార్డు బ్రేక్ అని టిటిడి అదనపు ఈవో వెంకయ్య చౌదరి మీడియా కు తెలియజేశారు...

# భార్యను హతమార్చిన భర్త

**ఖమ్మం** ఇన్సూరెన్సు డబ్బుల కోసం భర్త ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను దారుణంగా కొట్టి హతమార్చాడు. ఆపై తానే ఉరివేసుకొని చనిపోయినట్లు చిత్రీకరించాడు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం గోల్ తండాలో దారుణ ఘటన జరగింది. బంధువులు ఇన్సూరెన్స్ డబ్బుల కోసం భర్తే తన భార్యని హత్య చేసినట్లు ఆరోపిస్తున్నారు. ఇంటిపై 80 లక్షలు లోన్ ఉంది, ఆమె పేరు మీద కోటి రూపాయల ఇన్సూరెన్స్ ఉంది. ఇన్సూరెన్స్ క్లెయిమ్ కోసం భార్యని చిత్రవధ చేసి, చివరకు హత్య చేసినట్లు ఆరోపణ. గతంలో భార్యను కింద పడేసి పిడిగుద్దులతో హింసించిన దృశ్యాలు చూపించి.. భర్త శాడిజాన్ని బంధువులు చూపెట్టారు. 14 సంవత్సరాల క్రితం పెళ్లి చేసుకొని ఇద్దరు బాబులతో తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడు స్టేజి దగ్గరలోని గోల్ తండాలో మీనాక్షి, శివాజీ దంపతులు కాపురం ఏర్పాటు చేసుకున్నారు. శుక్రవారం ఉదయం ఆమెను హత్య చేసి ఉరేసుకున్నట్టుగా చిత్రీకరించి నిందితుడు పరారయ్యాడు.

## కేంద్రీయ విద్యాలయం తెచ్చే దమ్ము లేదు కానీ.. గొప్పలకు మాత్రం తక్కువ లేదా?":

**- ఎమ్మెల్యే సంజయ్ పై భోగ శ్రావణి రౌద్రం**

జగిత్యాల :మే 22: జగిత్యాల నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు తక్షణమే అనువైన ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని, విద్యార్థుల భవిష్యత్తుతో స్వార్థ రాజకీయం చేయడం మానుకోవాలని భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ బాధ్యురాలు డాక్టర్ భోగ శ్రావణి డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు జగిత్యాల జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కనీసం ఐదు ఎకరాల స్థలం అవసరమనే నిబంధన తెలిసికూడా, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కావాలనే చల్‌గల్ ప్రాంతంలో కేవలం రెండు ఎకరాల స్థలాన్ని చూపిస్తూ కేంద్ర ప్రతిపాదనలు తిరస్కరణకు గురయ్యేలా చేస్తున్నారని మండిపడ్డారు. సమగ్ర పాఠశాల కోసం ఇరవై ఎకరాలు సేకరిస్తున్న ప్రభుత్వం, కేంద్రీయ విద్యాలయంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని, ఎమ్మెల్యే కేవలం తన పాత కాంట్రాక్టు బిల్లుల క్లియరెన్స్ కోసమే అధికార పార్టీలోకి మారారని ఆరోపించారు. తక్షణమే చల్‌గల్ ప్రాంతంలో ఐదు ఎకరాలు కేటాయించి అద్దె భవనంలో తరగతులు ప్రారంభించాలని కోరారు. జగిత్యాల పురపాలక సంఘం పరిధిలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన అరవై రెండు కోట్ల రూపాయల నిధుల్లో ఒకటి నుండి నలభై ఎనిమిది వార్డుల వరకు భారీ ఎత్తున అవకతవకలు జరిగాయని, గతంలోనే పూర్తయిన సిమెంట్ రోడ్ల పనులకు మళ్లీ టెండర్లు పిలుస్తూ అరవై కోట్ల రూపాయల మేర కుంభకోణానికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరితహారం, రహదారి మధ్య నిరోధకాల నిర్మాణాలు, రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలపై తక్షణమే విజిలెన్స్ విచారణ జరపాలని పట్టుబట్టారు. అభివృద్ధి హక్కుల బదిలీ తీర్మానం ఆమోదం పొందినా ప్రతిష్టాత్మకమైన యావర్ రోడ్డు విస్తరణను ఎమ్మెల్యే తనకు కావాల్సిన వారి ప్రయోజనాల కోసమే ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని, చిత్తశుద్ధి ఉంటే ఆ రోడ్డు విస్తరణను పూర్తి చేసి చూపించాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో జగిత్యాల పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, నలభై రెండో వార్డు కౌన్సిలర్ నిమ్మల నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు మ్యాదరి అశోక్, ప్రధాన కార్యదర్శి ఆముదరాజు, ఉపాధ్యక్షులు పవన్ సింగ్, గదాసు రాజేందర్, గడ్డల లక్ష్మి, దూరిశెట్టి మమత, సిరిపురం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మహారాష్ట్రలో దారుణ ఘటన..!

**- మహారాష్ట్ర లో పులి దాడిలో నలుగురు మహిళలు మృతి..!**

**- ఆకులు ఎరుకోవడానికి వెళ్లిన నలుగురు మహిళలు పులి దాడిలో మృతి .!**

**- భయాందోళనలో గంజేవాహి అటవీ ప్రాంత ప్రజలు.!**



అడవిలో బీడీ ఆకులు ఏరుకోవడానికి వెళ్లిన నలుగురు మహిళలపై ఒకేసారి పులి దాడి చేసి చంపిన సంఘటన మహారాష్ట్రలోని చంద్రపుర్ జిల్లా గంజేవాహి అటవీ ప్రాంతంలో చోటుచేసుకొంది దీంతో సిందేవహి తాలుకాలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.ఉదయం పెద్ద సంఖ్యలో గ్రామీణ ప్రజలు ఎండిపోయిన బీడీ ఆకులు ఏరుకొనేందుకు అటవీ ప్రాంతంలోకి వెళ్లగా ఉదయం 8 గంటల సమయంలో ఓ పులి మాటువేసి వారిపై దాడి చేసింది దీనితో ఘటనా స్థలంలోనే నలుగురు మహిళలు మృత్యువాత పడ్డారు.మృతులను దాదాజీ మొహర్లే, అనుబాయి దాదాజీ మొహర్లే, సంగీతా సంతోష్ చౌదరీ, సునీతా కౌశిక్ మొహర్లేగా గుర్తించారు. వీరంతా 33 ఏళ్ల నుంచి 45 ఏళ్ల మధ్యవారే...ఈ ఘటన తర్వాత అటవీ ప్రాంతం చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఫారెస్ట్ రేంజి అధికారి అంజలీ సాయంకర్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకొన్నారు. ఒకేసారి పులి దాడిలో నలుగురు మహిళలు చనిపోవడంతో అటవీ పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారు.

## శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న దేవాదాయ కమిషనర్, ఈవో



**యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని కంచి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి దర్శించుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం, 2:30 నిమిషాలకు యాదగిరిగుట్ట దేవస్థానం కు చేరుకున్న ఆయనకు దేవాదాయ కమిషనర్ హనుమంతరావు, ఆలయ ఈవో భవాని శంకర్,అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ప్రధాన అర్చకులు అర్చక బృందం ఘనంగా స్వాగతం పలికారు.కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారి అనుబంధ ఆలయం అయినా పర్వతవార్ధని రామలింగేశ్వర ఆలయంలో కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి ప్రత్యేక పూజలు చేశారు. స్ఫటిక లింగమునకు ,స్వయంభు లింగానికి అభిషేకం చేశారు. అనంతరం కళా వేదిక వద్ద భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. వేద పండితులతో చతుర్వేద పారాయణం అనంతరం విజయేంద్ర సరస్వతి భక్తులకు ఉద్దేశించి ప్రసంగించారు.శనివారం ఉదయం దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. యాదగిరిగుట్ట లోని టెంపుల్ సిటీ నందు 15 ఎకరాలలో వేద పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపనలో పాల్గొంటారు. కళ్యాణమంటపం, దీక్షాపరుల సదనం ఇతర కార్యక్రమాలలో ఆయన పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు,వేద పండితులు భక్తులు పాల్గొన్నారు.

### తిరుమలలో భక్తుల రద్దీ నిర్వహణకు

# పకడ్బందీ చర్యలు

- అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి
- క్యూలైన్లు, ట్రాఫిక్, అన్నప్రసాదాల పంపిణీపై అదనపు ఈవో, జిల్లా ఎస్పీ సంయుక్త తనిఖీలు



**తిరుమల ( ప్రశ్న న్యూస్ )** వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలలో భారీగా పెరిగిన భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడుతో కలిసి శుక్రవారం సాయంత్రం తిరుమలలోని దర్శన క్యూలైన్లు, ట్రాఫిక్, భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అదనపు ఈవో భక్తులతో స్వయంగా మాట్లాడి టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం క్యూలైన్లలో భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ, తాగునీటి సదుపాయాలను పరిశీలించారు.అనంతరం ఆయన మీడియా తో మాట్లాడుతూ భక్తుల రద్దీ పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ, టీటీడీ విజిలెన్స్, ఇతర విభాగాలు సమన్వయంతో 24ఐ7 పాటు ఆకుంఠిత దీక్ష తో పనిచేస్తున్నాయని చెప్పారు.క్యూలైన్లలో భక్తులను క్రమబద్ధంగా పంపిస్తూ తొక్కిసలాటలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బందికి ప్రత్యేక సూచనలు ఇచ్చినట్లు చెప్పారు. శుక్రవారం అత్యధిక సంఖ్యలో వాహనాలు తిరుమలకు వచ్చినప్పటికీ, ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ ఈవోలు లోకనాథం, రాజేంద్ర, సోమన్నారాయణ, ఈ ఈ శ్రీనివాస్, వీజీవో సురేంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధారాణి, ఇతర టీటీడీ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- డాక్టర్ చెన్నాడి అమిత్ కుమార్
- జన్మదిన వేడుకల్లో భాగంగా మొక్క నాటిన డాక్టర్ చెన్నాడి అమిత్ కుమార్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు, కరీంనగర్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ చెన్నాడి అమిత్ కుమార్ శుక్రవారం తన జన్మదిన వేడుకలను పురస్కరించుకొని హైదరాబాద్‌లోని తన నివాసంలో కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ స్ఫూర్తితో నిర్వహిస్తున్న గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమంలో భాగంగా వారి ఇంటి ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం డాక్టర్ చెన్నాడి అమిత్ కుమార్ మాట్లాడుతూ గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమం ప్రతి ఒక్కరిలో పర్యావరణ పరిరక్షణపై చైతన్యం తీసుకొస్తోందని అన్నారు. ప్రకృతిని కాపాడటం ప్రతి వ్యక్తి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. సేవా కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలతో జన్మదినాన్ని జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.

## ఆత్మకూరు టిడ్కో కాలనీలో

# రామాలయ నిర్మాణాన్ని పరిశీలించిన: మంత్రి ఆనం

- రాష్టంలోని టిడ్కో కాలనీలకు రోల్ మోడల్‌గా ఆత్మకూరు రామాలయం
- ప్రత్యేక ఆకర్షణగా 27 నక్షత్రాల పవిత్రతను తెలుపుతూ 27 మొక్కలతో నక్షత్ర వనం ఏర్పాటు
- ఆత్మకూరు టిడ్కో కాలనీలో రామాలయ నిర్మాణాన్ని పరిశీలించిన: మంత్రి ఆనం
- శ్రీవాణి భజన మందిరాల్లో మొట్టమొదటి ఆలయం ఆత్మకూరు రామాలయం.
- టిడ్కో కాలనీలలో పేదలకు భగవదనుగ్రహం కల్పించాలనే దృఢ సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల నిర్మాణం చేపడుతున్నాం
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**ఆత్మకూరు (ప్రశ్న న్యూస్ )** రాష్ట్రంలోని టిడ్కో కాలనీలకు రోల్ మోడల్‌గా ఆత్మకూరు టిడ్కో కాలనీలో నిర్మాణంలో ఉన్న రామాలయం నిలుస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు.శుక్రవారం ఉదయం ఆత్మకూరు పట్టణం టిడ్కో కాలనీలో నిర్మిస్తున్న శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయాన్ని అధికారులు, స్థానిక నేతలతో కలిసి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, శ్రీవాణి భజన మందిరాల్లో రాష్ట్రంలోని మొట్టమొదటి ఆలయంగా నిర్మాణం పూర్తి కావస్తున్న ఆత్మకూరు టిడ్కో కాలనీలోని రామాలయాన్ని త్వరలోనే రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణచే ప్రారంభిస్తామని, ఆలయ నిర్మాణం తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను కూడా మంత్రి నారాయణ ఆధ్వర్యంలో శ్రీకారం చూడుతున్నట్లు చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఐదువేలకు పైగా శ్రీవాణి భజన మందిరాలు ప్రతిపాదించగా వెయ్యికి పైగా ఆలయాలకు నిధులు మంజూరు చేసి పనులు మొదలు పెట్టినట్లు చెప్పారు. ఆత్మకూరు నమూనాను ఆదర్శంగా తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా టిడ్కో కాలనీల్లో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రామాలయాల నిర్మాణానికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. పేదలు నివసించే టిడ్కో కాలనీల్లో ఆధ్యాత్మిక వాతావరణం కల్పించాలనే సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా భక్తుల ఆకాంక్షల మేరకు ఆలయాల మంజూరుకు చర్యలు చేపట్టినట్లు గుర్తు చేశారు.హిందూ ధర్మ వైభవం, సనాతన ధర్మ ఆచార వ్యవహారాలను పరిరక్షిస్తూ ప్రతి ఒక్కరిలో భక్తి భావం, ధార్మిక చింతన పెంపొందించడమే లక్ష్యంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యాన్ని తన్నుకు పోతున్న గద్దలు

- మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతున్న అక్రమ రేషన్ దందా
- అక్రమ రేషన్ దందాకు కేరాఫ్ అడ్రస్ "అప్పికట్ల" - కేజీ 10 కి కొని 50 కి అమ్మకం
- అధికారుల తనిఖీలు శూన్యం - నెలకు 50 లక్షలకు పైనే ఆదాయం
- అధికార పార్టీ నాయకుల అండదండలు - స్థానిక నాయకునికి లాభాల్లో వాటాలా.?




బాపట్ల(ప్రశ్న న్యూస్) బాపట్ల జిల్లా అప్పికట్ల గ్రామం లో అక్రమ రేషన్ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది.ప్రభుత్వం పేద ప్రజలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని కొంతమంది రైస్ మిల్లర్లు అడ్డదారుల్లో కొనుగోలు చేసి పాలిష్ పట్టి సన్న బియ్యం లో మిక్స్ చేసి అమ్ముతున్నారు.రేషన్ బియ్యాన్ని అడ్డదారుల్లో కేజీ 10 రూపాయలకు కొనుగోలు చేసి తిరిగి వాటిని సన్న బియ్యంతో కలిపి కేజీ 50 రూపాయలకు అమ్ముతున్నారు.ప్రజా పంపిణీ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడమే కాక మరోపక్క సన్నబియ్యంతో రేషన్ బియ్యాన్ని కలిపి సన్నబియ్యం అని కొనుగోలు చేస్తున్న ప్రజలను కూడా మోసం చేస్తున్నారు.బాపట్ల నియోజకవర్గం కేంద్రంగా 3 మండలాల నుండి రేషన్ బియ్యాన్ని సేకరించి అప్పికట్ల లోని ఒక మిల్లుకు తరలిస్తున్నారు.అక్కడ పాలిష్ పట్టి ఎక్కడి ఎన్ని బస్తాలు పంపాలో ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం అక్కడకు చేరవేస్తారు.ఈ తతంగం అంతా బాపట్ల లోని ప్రభుత్వ అధికారులకు తెలుసు. లోడ్ వచ్చే దగ్గర నుండీ తిరిగి లోడ్ వెళ్ళేది మొత్తం సమాచార ఎక్కడి నుండి వస్తుంది ఎక్కడికి వెళ్తుంది అనేవి అన్ని తెలుసు. కానీ ఏ అధికారి కూడా ఆ మిల్లు పై తనిఖీలు చేసి రేషన్ బియ్యాన్ని స్వాధీన పరచుకుని మిల్లు యజమానిపై కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవు.ఎందుకంటే ఒక్కొక్క శాఖకు ఒక శాఖ అధికారికి లక్ష,మరొక శాఖ అధికారికి లక్ష క్రింది స్థాయి అధికారికి యాభై వేలు,మరికొంత మందికి కలిపి లక్ష చొప్పున మామూళ్ళు ముట్టచెబుతున్నట్టు సమాచారం. పేద ప్రజలకు అందవలసిన బియ్యాన్ని దళారులు దోచుకుపోతుంటే అధికారులు చూస్తూ ఉండటంపై సర్వత్రా విమర్శలు గుప్పుమంటున్నాయి. కొన్ని ప్రాంతాల్లో భయం భయంగా రాత్రి వేళల్లో మాత్రమే అక్రమ రేషన్ సరఫరా చేస్తుంటే బాపట్ల లో మాత్రం పట్టపగలే ఎటువంటి భయం లేకుండా అక్రమం రేషన్ దందా నిర్వహిస్తున్నారు. మిట్ట మధ్యాహ్నం రెండు గంటల సమయంలో రైస్ మిల్లు గుడౌన్ లో 500 బస్తాలకు పైనే అక్రమ రేషన్ నిల్వ ఉంది అంటే ఈ వ్యాపారాన్ని ఎంత పకడ్బందీగా మేనేజ్ చేస్తున్నారో స్పష్టంగా అర్థమవుతుంది. మమ్మల్ని ఎవరు అడ్డుకునేది మా వ్యాపారానికి ఆటంకమే కలగదు అధికారులకు నాయకులకు నెల సరి మామూళ్ళు చెల్లించి వ్యాపారం చేసుకుంటున్నాం అని రైస్ మిల్లు యజమానులు బాహాటంగానే చెబుతున్నారు. విలేకరులు వార్తలు రాస్తే వారి మీద ఎలిగేషన్స్ తీసుకువస్తాం,డబ్బులు తీసుకుంటున్నారని ప్రచారం చేస్తాం, డబ్బులు డిమాండ్ చేశారని ప్రచారం చేసి కేసులు పెడతాం అని బెదిరిస్తున్నారు. అక్రమ రేషన్ రవాణా పై అక్రమ రేషన్ దందా పై ఎపి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఎప్పటి కప్పుడు దాడులు చేయిస్తూ అక్రమ రేషన్ రవాణాను అదుపులోనికి తీసుకురావాలని ప్రయత్నిస్తుంటే అధికారులు అక్రమ రేషన్ వ్యాపారులు కుమ్మక్కై విచ్చల విడిగా రేషన్ దందా చేస్తున్నారు. పేద ప్రజలకు చేరవలసిన బియ్యాన్ని ప్రజలకు చేరనివ్వకుండ రాబందులు తన్నుకు పోతుంటే అధికారులు అందుకు సహకరించట పై అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అప్పికట్ల లో జరుగుతున్న ఈ అక్రమ రేషన్ దందా పై ప్రజా ప్రశ్న లో వచ్చే వార్తకు అధికారులు స్పందించి అక్రమ రేషన్ దందా పై కొరడా విసురుతారో లేక జిల్లా స్థాయి అధికారులు చర్యలు తీసుకునే వరకు కళ్లకు గంతలు కట్టుకుని తిరుగుతారా అనేది వేచి చూడాలి.

### భూసారం పెంపుకు జీలుగ విత్తనాల

# వినియోగం శ్రేయస్కరం

- నేడు 50 శాతం రాయితీపై జీలుగ విత్తనాల పంపిణీ
- మండల వ్యవసాయ అధికారి : కె. ప్రణీత



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండల రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. ఈ వానాకాలం సీజన్‌కు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగలను 50 శాతం రాయితీపై పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి కె. ప్రణీత తెలిపారు.ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం బోయినిపల్లి, ప్రాథమిక సహకార సంఘం కోరేం, కెడిసిఎంఎస్ వెంకట్రావుపల్లి కేంద్రాల్లో జీలుగ విత్తన బ్యాగులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 30 కిలోల జీలుగ బస్తా పూర్తి ధర రూ.4,905 కాగా, ప్రభుత్వ రాయితీ అనంతరం రైతులకు రూ.2,452.50కే అందజేయనున్నట్లు తెలిపారు.జీలుగ విత్తనాలను చల్లి పూత దశలో కలియదున్నడం ద్వారా భూసారం పెంపొందడమే కాకుండా ఎకరానికి 8 నుంచి 10 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుందని, తద్వారా 40 నుంచి 50 కిలోల నత్రజని భూమికి అందుతుందని వివరించారు. నేటి శనివారం నుంచి రాయితీపై జీలుగ బస్తాల పంపిణీ ప్రారంభమవుతుందని, రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకాలతో రైతువేదిక బోయినిపల్లి, కోదురుపాక, కోరేం, విలసాగర్ కేంద్రాల్లో వ్యవసాయ విస్తీర్ణ అధికారులను సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి కె. ప్రణీత కోరారు.

## అనంతపల్లిలో ఘనంగా డాక్టర్ చెన్నాడి అమిత్ కుమార్ జన్మదిన వేడుకలు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని అనంతపల్లి గ్రామంలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు, కరీంనగర్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ చెన్నాడి అమిత్ కుమార్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వృద్ధులకు పండ్లు, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డాక్టర్ చెన్నాడి అమిత్ కుమార్ ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుంటూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజలకు అండగా నిలుస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు మల్లారపు చందు, గ్రామశాఖ అధ్యక్షుడు అల్వాల రాజయ్య, బావండ్ల కమలాకర్, రాజయ్య, శ్రీనివాస్, గణేష్, అజయ్ తదితర నాయకులు పాల్గొన్నారు.



## యూట్యూబ్ ఛానల్‌పై
# విష్ణుప్రియ ఫిర్యాదు..

సోషల్ మీడియాలో నటీనటుల వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ అసభ్యకరమైన కంటెంట్ పెట్టే వారిపై యాంకర్, నటి విష్ణుప్రియ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై నిరంతరం తప్పుడు ప్రచారం చేస్తోందంటూ 'ప్లే లైక్ ఇంకాగ్నిటో' అనే యూట్యూబ్ ఛానల్‌పై ఆమె హైదరాబాద్‌లోని మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విష్ణుప్రియ కంప్లైంట్‌తో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సందర్భంగా విష్ణుప్రియ మాట్లాడుతూ... సదరు ఛానల్ నడిపే వ్యక్తి ఒక అమ్మాయి అయ్యుండి కూడా, సెలబ్రిటీ మహిళల క్యారెక్టర్‌ను కించపరుస్తూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతోందని మండిపడ్డారు. తాము ఇండస్ట్రీకి వచ్చింది ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికని, నిజంగా తప్పు చేసినప్పుడు విమర్శిస్తే తలదించుకుని ఒప్పుకుంటామని అన్నారు.

కానీ, డబ్బుల కోసం శరీరం అమ్ముకుంటుంది అంటూ అసత్య ఆరోపణలు చేస్తుంటే ఇంకా నోరు మూసుకుని కూర్చోలేనని, అందుకే తనతో పాటు ఇండస్ట్రీలోని ఆడపిల్లల కోసం ఈ నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి ఒక ఛానల్‌పై చర్యలు ప్రారంభించామని, ఇకపై ఎవరు ఇలాంటి రాంగ్ ఇన్ఫర్మేషన్‌ను ప్రాజెక్ట్ చేసినా వారి యూట్యూబ్ ఛానల్స్‌పై స్ట్రైక్స్ పడేలా, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకునేలా ముందుకు వెళతామని విష్ణుప్రియ హెచ్చరించారు.



## 'బాహుబలి' బడ్జెట్ గురించి
# తమన్నా ఆసక్తికర వ్యాఖ్యలు

ఒకప్పుడు టాప్ స్టార్ హీరోల సరసన నటిస్తూ సౌత్ ఇండియాలోనే మోస్ట్ వాంటెడ్ అగ్ర తారగా ఒక వెలుగు వెలిగింది మిల్కీ బ్యూటీ తమన్నా. అయితే, ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ టాలీవుడ్‌కు కాస్త దూరమై, బాలీవుడ్‌లోనే వరుస ప్రాజెక్టులతో బిజీగా గడుపుతోంది.

తాజాగా తమన్నా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో తన కెరీర్‌లోనే బిగ్గెస్ట్ మైల్‌స్టోన్ హిట్‌గా నిలిచిన 'బాహుబలి' చిత్రం గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తమన్నా తన ఇంటర్వ్యూలో బాహుబలి బడ్జెట్, ట్రేడ్ రిస్క్ గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది.

"నేటి పరిస్థితులను బట్టి ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే బాహుబలి కోసం తీసుకున్న ప్రతి నిర్ణయం అద్భుతమైనదిగా అనిపిస్తోంది. కానీ ఆ సినిమా తీస్తున్న సమయంలో ట్రేడ్ లెక్కలు పూర్తిగా భిన్నంగా ఉండేవి. కేవలం ఒక ప్రాంతీయ భాషకు సంబంధించిన సినిమా కోసం ఆ రోజుల్లోనే రూ. 200 కోట్ల బడ్జెట్‌ను ఖర్చు చేయడం సాధారణమైన విషయం కాదు. అప్పటి మార్కెట్ పరిస్థితులను బట్టి వ్యాపార పరంగా చూస్తే.. అది ఫ్లాప్‌కు దారితీసే అత్యంత ప్రమాదకరమైన మార్గం లాగా అనిపించింది. కానీ ఆ రోజుల్లో రాజమౌళి తన విజన్‌ను నమ్మారు. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఆ చిత్రాన్ని తెరకెక్కించారు కాబట్టే, అంతటి అద్భుతమైన గ్లోబల్ విజయాన్ని సాధించింది. లేదంటే చాలా పెద్ద సమస్యలు ఎదురయ్యేవి" అని తమన్నా జక్కన్న విజన్‌ను కొనియాడింది.

# రుషః మూవీ రివ్యూ



భార్యాల చేతిలో నలిగిపోతూ, వాళ్లు పెట్టే టార్చర్ అనుభవిస్తూ భార్యా బాధితులుగా ఉన్న పాత్రలతో కథలు అల్లుతూ, పూర్తి వినోదాత్మకంగా తెరకెక్కిన సినిమాలు దాదాపుగా తెలుగులో విజయాలు సాధించాయి. ఇలాంటి కథాంశాలకు వినోదాన్ని జోడించి ఎంటర్‌టైన్ చేయగలిగితే ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ఆడాళ్ల అహంకారం, ఆడాళ్ల చేతిలో బలైపోయి, అనుమానాలు పడిన మగాళ్ల కథలు, వెతలతో ఇప్పటి వరకు వచ్చిన ప్రతి సినిమా సక్సెస్ సాధించింది. క్షేమంగా వెళ్లి లాభంగా రండి, పెళ్లాం ఊరేళితే, ఎఫ్-2 లాంటి సినిమాలు ఇందుకు ఉదాహరణలు. ఇక ఇలాంటి కథాంశంతో వచ్చిన మరో భార్యా భాదితుల కథే -పురుషః, మరి ఈ పురుషః చిత్రంలో ప్రేక్షకులు ఎంటర్‌టైన్ అయ్యే అంశాలున్నాయా? ఈ కొత్తటీమ్ చేసిన ప్రయత్నం ఏ మేరకు ఆకట్టుకుంది? అనేది రివ్యూలో తెలుసుకుందాం. గోవింద్ (పవన్ కల్యాణ్), త్రిమూర్తులు (సప్తగిరి), శీను (కసిరెడ్డి), కిస్ (వెన్నెల కిషోర్) చిన్నప్పటి నుంచి ఒకే ఊరిలో కలిసి పెరిగిన స్నేహితులు. వీరిలో కిస్‌కు తప్ప అందరికి పెళ్లి జరుగుతుంది. అయితే భార్యల చేతిలో నలిగిపోతున్న బాధితులుగా ముగ్గురు బాధపడుతుంటారు. వీళ్లంటే భార్యలకు అసలు లెక్కలేదు. నిత్యం గొడవలే. ఇక అనుకోకుండా కిస్ పెళ్లికి ముగ్గురు స్నేహితులు కుటుంబంతో కలిసి వెళతారు. అయితే అక్కడే తమ భర్తల గురించి కొన్ని వాస్తవాలు భార్యలకు తెలుస్తాయి. భర్తల నిజ స్వరూపం తెలుసుకున్న భార్యలు ఏం చేశారు? వాళ్లు చేసిన పనులతో భర్తలు ఎలాంటి ఇబ్బందులు ఫేస్ చేయాల్సి వచ్చింది? భార్యలు విడాకులు ఇవ్వాలని నిర్ణయించుకున్న తరువాత జరిగిందేమిటి? కిస్ వల్ల తెలిసిన నిజాలు ఏమిటి? వాటి వల్ల ఈ ముగ్గురి స్నేహితుల కాపురాల్లో జరిగిందేమిటి? అనేది మిగతా కథ. ప్రస్తుతం సమాజంలో భార్యా భాదితులు ఎక్కువగా ఉన్నారనే తలంపుతో దర్శకుడు రాసుకున్న కథ ఇది. అలాంటి వాళ్లు అందరూ ఈజీగా అందరూ కనెక్ట్ అయిపోతారని ఈ కథకు కాస్త వినోదాన్ని జోడించి దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. సినిమా ప్రారంభం నుంచే భార్యాభర్తల మధ్య గొడవలు, విడాకులు, కోర్టులు అంటూ ఈ కామెడీ కథను కాస్త సీరియస్‌గా మొదలుపెట్టారు. ప్రారంభంలో కాస్త బోరింగ్‌గా అనిపించిన ఫస్టాఫ్‌లో కిస్‌గా వెన్నెల కిషోర్ పాత్ర ఎంట్రీతో కథ కాస్త ఊపందుకుంది. ముఖ్యంగా వెన్నెల కిషోర్ శోభనం ఏపిసోడ్, ఆ సమయంలో ముగ్గురు స్నేహితుల చిన్నప్పటి రాసలీలలు డైరీలో భార్యలు చదివే సన్నివేశాలు ఆడియన్స్‌కు కావాల్సినంత వినోదాన్ని అందించింది. ఈ సన్నివేశాలు మినహా ఫస్టాఫ్‌లో సీన్స్ అన్నీ సాగదీతలా బోరింగ్‌గా అనిపించాయి. ఇలాంటి కథతో చేసే సినిమాకు హిలేరియస్ కామెడీ ఉంటేనే వర్కవుట్ అవుతుంది. అక్కడక్కడ నవ్విస్తూ, ఎక్కువగా విసిగిస్తూ ఉంటే ఆడియన్స్‌ను ఆకట్టుకోవడం కష్టమే. ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలను చూస్తుంటే ఇంతకు ముందు వచ్చిన ఈ తరహా సినిమాల్లోని సన్నివేశాలను కాపీ చేసినట్లుగా అనిపించాయి. కొత్త తరహా సన్నివేశాలకు ఏ మాత్రం ప్రయత్నించలేదు. ముఖ్యంగా ముగ్గురు స్నేహితులు జడ్జ్ (వీటీవీ గణేష్)కి తమ కథను చెప్పుకునే సీన్స్ లెంగ్తీగా, స్లో అనిపిస్తాయి. స్లోగా, నీరసంగా కదులుతున్న ఈ సినిమాలో వేగం పెంచింది మాత్రం వెన్నెల కిషోర్ పాత్రే. ఆయన తన టైమింగ్‌తో, డైలాగ్స్‌తో అలరించాడు. సెకండాఫ్‌లో ఫ్రెంచ్ అమ్మాయి, హీరోకి వచ్చే ప్రేమ సన్నివేశాలు రక్తికట్టలేదు. అక్కడక్కడ నవ్వించిన ఈ సినిమాలో ఎమోషన్స్ పండించడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. కథగా ఫర్వాలేదనిపించినా, రైటింగ్ పరంగా పెద్దగా శ్రద్ధ పెట్టలేదు. కామెడీ డోస్ సరిపోలేదు. అందుకే 'పురుషః' పూర్తిస్థాయిలో అలరించలేదు. ఈ చిత్రంలో హీరోగా నటించిన పవన్‌కల్యాణ్ నటన పరంగా పర్వాలేదనిపించాడు. అయితే నటనలో మరింత పట్టు సాధించాల్సిన అవసరం ఉంది. వెన్నెల కిషోర్ తనదైన శైలిలో వన్‌మ్యాన్ షో చేశాడు. సప్తగిరి కామెడీ కాస్త రిలీఫ్‌గా అనిపించింది. ఈ సినిమాలో కసిరెడ్డి పోషించిన పాత్రను చూస్తుంటే కంటిన్యూగా ఒకే తరహా పాత్రలు చేస్తున్నాడా? అనే సందేహం కలుగుతుంది.

ఆయన పాత్రలు రొటిన్ అయిపోతున్నాయి. వీటీవీ గణేష్ డైలాగ్ డెలివరి, బాడీ లాంగ్వేజ్ సీన్స్ వల్ల సన్నివేశాలు మరింత స్లోగా అపిపించాయి. హీరోయిన్‌లుగా నటించిన ముగ్గురు విషిక, రాయంచ, హాసిని సుధీర్‌లు తమ పాత్రలకు న్యాయం చేశారు. పాటలు ఆకట్టుకోలేదు.నేపథ్య సంగీతం గురించి ప్రత్యేకంగా చెప్పుకునే స్థాయిలో లేదు. నిర్మాణ విలువలు పర్వాలేదు. కథకు తగ్గట్టుగా ఖర్చు పెట్టారు. ఓవరాల్‌గా పురుషః పూర్తిస్థాయిలో అలరించకపోయినా..అక్కడక్కడా మాత్రం నవ్వులు పంచింది.

## కంగనా రనౌత్‌కు
# రహస్యంగా పెళ్లయిందా?..
### - వైరల్ అయిన మంగళసూత్రం



నటి, రాజకీయ నాయకురాలు కంగనా రనౌత్ రహస్యంగా పెళ్లి చేసుకున్నారా? సోషల్ మీడియాలో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్. మెడలో మంగళసూత్రంతో కంగనా కనిపించిన ఒక వీడియో ఇంటర్నెట్‌లో వైరల్ కావడంతో ఈ ఊహాగానాలకు తెరలేచింది. అయితే, ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, అదంతా సినిమా చిత్రీకరణలో భాగమని తేలింది.

### ఏం జరిగింది?

ప్రముఖ ఫోటోగ్రాఫర్ వైరల్ భయానీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కంగనా రనౌత్‌కు సంబంధించిన ఒక వీడియోను షేర్ చేశారు. అందులో కంగనా సంప్రదాయ దుస్తుల్లో, మెడలో మంగళసూత్రంతో కనిపించారు. ఈ వీడియో చూసిన అభిమానులు, నెటిజన్లు ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. కంగనా ఎవరికీ చెప్పకుండా రహస్యంగా పెళ్లి చేసుకున్నారేమోనని కామెంట్ల రూపంలో ప్రశ్నల వర్షం కురిపించారు. కంగనా వైపు నుంచి గానీ, ఆమె బృందం నుంచి గానీ వెంటనే ఎలాంటి స్పందన రాకపోవడంతో ఈ ప్రచారం మరింత ఊపందుకుంది.

### అసలు నిజం ఇదే!

అయితే, ఈ ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టమైంది. కంగనా ధరించిన మంగళసూత్రం ఆమె వ్యక్తిగత జీవితానికి సంబంధించింది కాదు. 2014లో విడుదలై భారీ విజయం సాధించిన 'క్వీన్' సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న 'క్వీన్ 2' సినిమాలోని పాత్ర కోసం ఆమె ఆ లుక్‌లో కనిపించారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. అందులో భాగంగానే కంగనా ఈ గెటప్‌లో ఉన్నారని తెలిసింది.'క్వీన్ 2' చిత్రాన్ని నిర్మిస్తున్న విషయాన్ని దర్శకుడు వికాస్ బహల్ సైతం ఇటీవల ధృవీకరించారు. "మేము కొంతకాలంగా 'క్వీన్ 2'పై పనిచేస్తున్నాం.

చివరికి ఒక స్పష్టమైన రూపం వచ్చింది" అని ఆయన పింక్‌విల్లాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. మొదటి భాగంలో పెళ్లి రద్దవ్వడంతో ఒంటరిగా హనీమూన్‌కు యూరప్ వెళ్లే 'రాణి మెహ్రా' అనే యువతి పాత్రలో కంగనా నటనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు దక్కాయి. ఇప్పుడు ఆ చిత్రానికి సీక్వెల్ వస్తుండటంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# 'మధువిధు' మూవీ రివ్యూ!

సాధారణంగా మలయాళం నుంచి థ్రిల్లర్ కాన్సెప్ట్ తో కూడిన సినిమాలు ఎక్కువగా వస్తుంటాయి. ఈ జోనర్ పై మలయాళ మేకర్స్ మరింత పట్టు చూపుతుంటారు. అయితే ఈ వారం మలయాళం నుంచి ఒక రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమానే 'మధువిధు'. విష్ణు అరవింద్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఏప్రిల్ 23వ తేదీన థియేటర్లకు వచ్చింది. షరాఫుద్దీన్ - కల్యాణి పణిక్కర్ జంటగా నటించిన ఈ సినిమా, ఈ రోజు ( మే 22వ తేదీ) నుంచి 'సోనీలివ్'లో ఐదు భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. కేరళ ప్రాంతంలో .. ఎర్నాకులం పరిధిలో 'కొచ్చాంబళం' అనే ఒక ఊళ్లో రాజ్ కుమార్ ఫ్యామిలీ నివసిస్తూ ఉంటుంది. తన తండ్రి .. తమ్ముడు అంబరీష్ .. కొడుకులు అమృత రాజ్ (షరాఫుద్దీన్)విమల్ రాజ్ (అమల్ జోస్) కలిసి నివసిస్తూ ఉంటారు. ఆడదిక్కు లేని కుటుంబాన్ని అతికష్టం మీద నెట్టుకుంటూ వస్తుంటారు. అమృత్ రాజ్ ఒక కేఫ్ నడుపుతూ ఉంటాడు. అతని తమ్ముడు విమల్ రాజు యూ ట్యూబర్ గా బిజీ. ఇక వాళ్ల బాబాయ్ చేసేది కేబుల్ టీవీ బిజినెస్. అదే ఊళ్లో మార్కోస్ (శశి కుమార్)కి స్నేహ (కల్యాణి పణిక్కర్) సోఫియా (అనుశ్రేయ రాజన్) అనే కూతుళ్లు ఉంటారు. మార్కోస్ చెల్లెలు మెర్సీ (శ్రీ జయ నాయర్) ఆమె కూతురు 'మిలి' కూడా అతని దగ్గరే ఉంటూ ఉంటారు. అందుకు కారణం మెర్సీని ఆమె భర్త మోసం చేసి వెళ్లిపోవడమే. స్నేహనీ .. ఆమె చెల్లెలు సోఫీయాను, జోయెల్ - టామ్ అనే అన్నదమ్ములకు ఇచ్చి పెళ్లి చేయాలని మార్కోస్ నిర్ణయించుకుంటాడు. అందుకు అందరూ ఒప్పుకుంటారు కూడా.రాజ్ కుమార్ భార్య సరోజిని చనిపోయిన దగ్గర నుంచి ఆ ఇంట్లోకి ఆడమనిషి అంటూ కాలు పెట్టదు. రాజ్ కుమార్ తమ్ముడికి గానీ .. ఆయన ఇద్దరు కొడుకులకు గాని సంబంధాలు కుదరవు. అందుకు కారణం ఆ ఇంటికి నాగదోషం ఉందనే ప్రచారం జరగడమే. అందువలన రాజ్ కుమార్ తమ్ముడు .. ఆయన కొడుకులు పెళ్లిపై ఆశలు వదులుకుంటారు. వంతుల వారీగా వంట చేస్తూ కాలక్షేపం చేస్తుంటారు. ఈ నేపథ్యంలోనే అమృత్ రాజ్ - స్నేహ ఇదద్రూ ప్రేమలో పడతారు .. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటారు. ఈ విషయాన్ని గురించి ఇరు కుటుంబాలవారు మాట్లాడుకుంటారు. అమృత రాజ్.. స్నేహ పెళ్లికి ఏర్పాట్లు జరుగుతూ ఉండగా, స్నేహ మేనత్త మెర్సినీ, అమృత్ రాజ్ తండ్రి రాజ్ కుమార్ రహస్యంగా పెళ్లి చేసుకుంటాడు. అప్పుడు ఏం జరుగుతుంది? ఆ సంఘటనతో కథ ఎలాంటి మలుపు తిరుగుతుంది? అనేది కథ.సాధారణంగా ఆడదిక్కులేని ఇంటికి పిల్లను ఇవ్వకపోవడమనే ఒక ఆలోచన పూర్వీకుల నుంచి కనిపిస్తుంది. ఇక ఏదైనా కుటుంబానికి దోషం ఉందనే ప్రచారం జరిగితే కూడా, ఆ ఇంట్లో వాళ్లకి పెళ్లి కావడం కష్టమే. అలాంటి ఒక సమస్యను ఆ కుటుంబ సభ్యులు ఎలా అధిగమిస్తారు? వాళ్ల జీవితాలను పెళ్లి అనేది ఎలా ప్రభావితం చేస్తుంది? అనే ప్రధానమైన అంశం చుట్టూ ఈ కథను అల్లుతూ వెళ్లారు. ఇది ఒక విలేజ్ చుట్టూ .. రెండు కుటుంబాల చుట్టూ తిరిగే కథ. ఒక ఇంటికి రాజ్ కుమార్ యజమాని. అతను తన తమ్ముడికీ .. ఇద్దరు కొడుకులకు పెళ్లి చేయవలసి ఉంటుంది. మరొక ఇంటికి యజమాని మార్కోస్. తన ఇద్దరి కూతుళ్లకు, ఒక మేనకోడలికి పెళ్లి చేయవలసిన బాధ్యత అతనిపై ఉంటుంది. 'పెళ్లి' అనేది ఈ రెండు కుటుంబాలలో ఎలాంటి సమస్యలు సృష్టిస్తుందనేది ఆవిష్కరించిన విధానం ఆకట్టు కుంటుంది. నాగదోషం ఉందని రాజ్ కుమార్ ఇంటికి ఎవరూ పిల్లనివ్వరు. అలాంటి పరిస్థితుల్లో ఆ ఇంటికి చెందిన మగాళ్లంతా ఒక్కొక్కరూ లవ్ లో పడిన తీరును డిజైన్ చేసుకున్న విధానం చాలా సరదాగా అనిపిస్తుంది. అలకలు .. బుజ్జగిం పులు .. వేడుకలు .. వేదనలు .. ఇలా అన్నింటినీ కలుపుకుంటూ ఈ కథను ముందుకు తీసుకెళ్లడం మెప్పిస్తుంది. ముఖ్యంగా పట్టెమం చం చేయించడం .. వద్దనడం, తరచూ ఒకే దగ్గర కేబుల్ వైర్ తెగిపోవడం వంటి సన్నివేశాలు నవ్వు తెప్పిస్తాయి.దర్శకుడు కథాకథనాలను తయారు చేసుకున్న తీరు బాగుంది. అలాగే పాత్రలు .. స్వరూప స్వభావాలను ఆవిష్కరించిన విధానం సరదాగా సాగుతూ ఆకట్టుకుంటుంది. విశ్వజిత్ ఫొటోగ్రఫీ .. హేషమ్ అబ్దుల్ వాహెబ్ సంగీతం .. క్రిస్టీ సెబాస్టియన్ ఎడిటింగ్ ఫరవాలేదు. స్త్రీలైనా .. పురుషులైనా పెళ్లి అనే మాటకు దూరంగా ఉంటూ పొందే స్వేచ్ఛ వేరు.

పెళ్లి చేసుకుని పొందే సంతోషం వేరు. పెళ్లి అనేది ఒక పంజరం లాంటిదని చాలామంది భావిస్తుంటారు. కానీ పెళ్లి అనేది ఒక అందమైన బంధం అనే సందేశాన్ని ఇచ్చిన సినిమా ఇది. బోర్ కొట్టకుండా సింపుల్ కంటెంట్ తో సరదాగా సాగిపోయే సినిమా ఇది.



## ముదిరాజ్ కులదైవాల
## కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహణ



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** జగదేవపూర్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ముదిరాజ్ కులదైవాలు పెద్దమ్మతల్లి, మంకాలమ్మ అమ్మవార్ల కళ్యాణ మహోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తుల రద్దీ నెలకొనగా, ప్రత్యేక పూజలు, సంప్రదాయ కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.ముందుగా పెద్దమ్మ దేవాలయం వద్ద ఒగ్గు కళాకారులు పెద్దిరాజు--పెద్దమ్మ కళ్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దమ్మతల్లి కళ్యాణాన్ని రాగుల మల్లేశం దంపతులు నిర్వహించారు. అనంతరం అగ్నిగుండాలు, పట్నాలు, ఒగ్గు కళాకారుల నృత్యాలు, శివసత్తుల శిగాలతో ఉత్సవాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.తదుపరి మంకాలమ్మ అమ్మవారికి వైభవంగా కళ్యాణ కార్యక్రమాలు నిర్వహించగా, మంకాలమ్మ కళ్యాణాన్ని కొంపెల్లి కృష్ణ దంపతులు నిర్వహించారు. భక్తుల హారతులు, మంగళవాయిద్యాల నడుమ కళ్యాణ వేడుకలు ఘనంగా సాగాయి.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ పెద్దలు రాగుల రాజయ్య, కొంపెల్లి కృష్ణ, రాగుల నర్సింహులు, రాయరం చంద్రయ్య, మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రాగుల రాజు, గ్రామ అధ్యక్షుడు కోనమైన బాలయ్య, రిపోర్టర్ బలరాం, కోశాధికారి బాలనరసయ్య, ఆరె కనకయ్య, ముదిరాజ్ సంఘ సభ్యులు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా వాసవి క్లబ్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో వాసవి క్లబ్, యూత్ క్లబ్, వనిత క్లబ్ గజ్వేల్--ప్రజ్ఞాపూర్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వాసవి క్లబ్ గవర్నర్ సముద్రాల కృష్ణమూర్తి నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ గంప శ్రీనివాస్ హాజరయ్యారు. అలాగే మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.వాసవి క్లబ్ అధ్యక్షునిగా గంగిశెట్టి వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా గంగా రమేష్, కోశాధికారిగా తొడుపునూరి కాశీనాథ్ బాధ్యతలు స్వీకరించారు. యూత్ క్లబ్ అధ్యక్షునిగా బుస్సా నితీష్, ప్రధాన కార్యదర్శిగా కైలాస ప్రశాంత్, కోశాధికారిగా ఎర్రం విక్రాంత్ ప్రమాణ స్వీకారం చేశారు.అలాగే వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలిగా గంగిశెట్టి నాగమణి, ప్రధాన కార్యదర్శిగా జగ్గయ్యగారి లత, కోశాధికారిగా సిద్ది నాగశ్రీ బాధ్యతలు చేపట్టారు.ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా చామర్తి శ్రీనివాస్, మాంకాల నవీన్ కుమార్, హరికిరణ్, చింత రాజేంద్రప్రసాద్, కె వెంకటేశ్వరరావు, జగ్గయ్యగారి శేఖర్, అయ్యప్ప దేవాలయం అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్, ఉప్పల మెట్టయ్య, ఉప్పల కృష్ణమూర్తి, అత్తెల్లి శ్రీనివాస్, మల్యాల భద్రయ్య, సిరిపురం చంద్రకళ, కొమురవెల్లి సరిత, తొడుపునూరి శారద, గంగిశెట్టి బాలయ్య, ఆంజనేయులు, ఉమేష్, భాస్కర్, సంతోష్ కుమార్, గందె యాదగిరి, గంగిశెట్టి శారద, మంజుల, సిరిపురం సత్యనారాయణ, కొత్త గోవర్ధన్, గందే సంతోష్ తదితరులు పాల్గొన్నారు.ఆర్యవైశ్య నాయకులు, వాసవి క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

## కొనుగోలు కేంద్రాల్లో సమస్యలను
# వెంటనే పరిష్కరించాలి

**- తరుగు పేరుతో రైతుల దోపిడీ ఆపాలి**
**- బీజేపీ మండల అధ్యక్షులు అనుముల సంపత్ రెడ్డి**



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** కుకునూర్‌పల్లి మండలంలోని ఐకేపీ, సహకార సంఘాల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షులు అనుముల సంపత్ రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర, జిల్లా పార్టీ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు తీవ్ర జాప్యంగా జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని ఆసరాగా చేసుకుని “తరుగు” పేరుతో క్వింటాల్‌కు ఇష్టానుసారంగా కిలోలు కట్ చేస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ విధానాన్ని వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు.రానున్న రుతుపవనాలు, అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు ప్రక్రియనుయుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో గన్ని బ్యాగుల కొరత లేకుండా చూడడంతో పాటు రైతులకు తాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ధాన్యం విక్రయించిన రైతులకు వెంటనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేసిన ఆయన, రైతుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బోనాల రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు గౌరారం కృష్ణ, మండల కోశాధికారి మల్లిపెద్ది రమేష్, బూత్ అధ్యక్షులు రమేష్ యాదవ్, గాండ్ల భాను, కార్యకర్తలు లాస్కరి శ్రవణ్, అఖిల్, బోనగిరి చందు, రొయ్యల స్వామి, కుక్కల మధు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల కడుపు కొట్టే
# రాజకీయాలు ఇక సాగవు!

**- రాణే మద్రాస్ లిమిటెడ్ ప్రజ్ఞాపూర్ బీఎంఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సల్ల శ్రీనివాస్**



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** అబద్ధాల పునాదులపై యూనియన్ల మనుగడ సాగదని, వాస్తవాలను కార్మిక లోకం గ్రహిస్తోందని రాణే మద్రాస్ లిమిటెడ్ ప్రజ్ఞాపూర్ పరిశ్రమ బీఎంఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సల్ల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం గజ్వేల్‌లో ఆయన మీడియా తో మాట్లాడుతూ కార్మికులను తప్పుదోవ పట్టించే రాజకీయాలకు ఇక కాలం చెల్లిందన్నారు.కొత్త లేబర్ కోడ్‌ల పేరుతో కేంద్ర ప్రభుత్వం కార్మికుల గొంతు కోస్తోందని, ఇకపై వేతనాల పెరుగుదల ఉండదని, కనీస వేతనం రూ.175కు పడిపోతుందని కొంతమంది కమ్యూనిస్టు నాయకులు ప్రచారం చేశారని విమర్శించారు. అయితే ప్రస్తుతం వేతనాలు పెరుగుతున్న నేపథ్యంలో వారు నోట మాట రావడం లేదన్నారు. తమ తప్పును అంగీకరించే ధైర్యం లేక “ఈ పెంపు సరిపోదు” అంటూ ప్రెస్ నోట్లు విడుదల చేయడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు.కార్మికుల వేతన సవరణలు, వీడీఏ పాయింట్ల ఆధారంగా పెరిగే అలవెన్సులు ఆర్థిక సూచికలు, చట్టబద్ధమైన హక్కుల ఆధారంగా నిర్ణయించబడతాయని తెలిపారు. ఈ పారిశ్రామిక వాస్తవాలను దాచిపెట్టి, అన్నీ నాశనం అయిపోతున్నాయంటూ ప్రచారం చేయడం అమాయక కార్మికులను వంచించడమేనని అన్నారు.రాజకీయ వ్యూహాలు, ఎత్తుగడలు రాజకీయ వేదికల వరకే పరిమితం కావాలన్నారు. ఫ్యాక్టరీలో పనిచేసే ప్రతి కార్మికుడు తన కుటుంబ పోషణ కోసం శ్రమిస్తున్నాడని, వారి జీవనాధారంతో ఆడుకునే హక్కు ఎవరికీ లేదని హెచ్చరించారు.కార్మికుల ప్రయోజనాల కోసం యాజమాన్యాలతో జరిగే చర్చలు, పనివేళల షిఫ్ట్ టైమింగ్స్‌పై జరిగే సంప్రదింపులు పారదర్శకంగా ఉండాలని, వాటిని స్వార్థ రాజకీయాలకు బలిచేయకూడదన్నారు.ఇప్పటికైనా యూనియన్ నాయకులు అసత్య ప్రచారాలను నిలిపివేసి, కార్మికులకు చట్టాల్లోని వాస్తవాలు, వేతన పెంపుల గణాంకాలను నిజనిజాలుగా వివరించాలని సూచించారు. శ్రమను నమ్ముకున్న కార్మికుల జీవితాలతో ఆడుకోవడం మానుకోవాలని, లేదంటే కార్మిక లోకమే తగిన బుద్ధి చెబుతుందని హెచ్చరించారు.

## రంగనాయక స్వామి ఆలయ భూములు పరిరక్షించండి

రాష్ట్రీయ వానరసేన
“ఆలయ భూముల కాపలాదారులు”

బాలాపూర్ (ప్రశ్న న్యూస్) అక్రమార్కుల చేతుల్లో అన్యాక్రాంతమవుతున్న ఆలయ భూముల పరిరక్షణకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని రాష్ట్రీయ వానరసేన నాయకులు డిమాండ్ చేసారు. రంగారెడ్డి జిల్లాలోని బాలాపూర్ మండల పరిధిలో గల మామిడిపల్లి గ్రామంలోని శ్రీ రంగనాయకస్వామి ఆలయానికి సంబంధించిన సర్వేనెంబర్ 99/2 లోని 15 ఎకరాల 22 గుంటల భూమి అక్రమార్కుల చేతుల్లో కబ్జాకు గురవుతోందని రాష్ట్రీయ వానరసేన సభ్యులు ఆరోపించారు. ఇక్కడ కొంత మంది అక్రమార్కులు నకిలీ పత్రాలు సృష్టించి ఆలయ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నాలు చేయడమే కాక ఎలాంటి అనుమతులు లేకుండా ఆలయ పరిధిలో జీవసమాధిని నిర్మించారని తెలిపారు. దీనిపై దేవాదాయశాఖ అధికారులు వెంటనే స్పందించి ఆలయ భూమి కబ్జాపై విచారణ చేపట్టి, ప్రభుత్వ రికార్డుల ప్రకారం భూమిని సర్వే చేసి అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించి హద్దులు ఏర్పాటు చేసి ఆలయ భూమిని కబ్జాల నుండి పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఏ మేరకు ఎడ్ల కేశవర్దన్ రెడ్డి ఆధ్వర్యంలో దేవాదాయశాఖ కమిషనర్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

## బిజెపి ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గా రూపవత్ మహేష్



**తార్నాక(ప్రశ్న న్యూస్)** బిజెపి ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గా రూపవత్ మహేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మహేష్‌మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు,ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు నేనవత్ రవి నాయక్ లకు ధన్యవాదాలు తెలిపారు. గిరిజన సోదరుల సంక్షేమం, అభివృద్ధి కోసం మరియు పార్టీ బలోపేతానికి వంతు కృషి చేస్తూ, అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో, సమర్థవంతంగా నిర్వర్తిస్తానని తెలిపారు. తపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతానన్నారు

## చెరువుల మట్టి అక్రమ తరలింపును అడ్డుకోవాలి

**- సిపిఎం పార్టీ మండల కన్వీనర్ : గురిజాల శ్రీధర్**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, వరదవెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని దుబ్బపల్లి చిట్కు చెరువు, విలాసాగర్ పెద్ద చెరువుల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని సిపిఎం పార్టీ ఆరోపించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.వారం రోజులుగా పదుల సంఖ్యలో లారీలతో మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సిపిఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ విమర్శించారు. మట్టి మాఫియాపై చర్యలు తీసుకొని చెరువుల మట్టిని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.

## గురువారం రికార్డు స్థాయిలో
# 79 వేల మందికి శ్రీవారి దర్శనం


**- అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి**
**- అభిషేక సేవలోనూ 5 వేల మంది సర్వదర్శన భక్తులకు దర్శనం**
**- టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి**



**తిరుమల (ప్రశ్న న్యూస్)** వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగినప్పటికీ సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ అత్యంత సమర్థవంతంగా దర్శన ఏర్పాట్లు చేస్తోందని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు.శుక్రవారం ఉదయం ఆయన శ్రీవారి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా భక్తుల రద్దీని ముందుగానే అంచనా వేసి టైమ్ మేనేజ్మెంట్, క్యూలైన్ల నిర్వహణ, నిరంతర పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించడంతో దర్శనాల సంఖ్యలో గణనీయమైన వృద్ధి సాధ్యమైందన్నారు.ప్రతిరోజూ సాధారణ దర్శనాలతో పాటు అదనంగా 15 వేల మందికి పైగా భక్తులకు శ్రీవారి దర్శనం కల్పిస్తున్నామని వెల్లడించారు. ముఖ్యంగా శ్రీవారి అభిషేక సేవ సమయంలోనూ ఐదు వేల మంది సర్వదర్శన భక్తులకు దర్శనం కల్పించడం ద్వారా సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు.సాధారణంగా గురువారం నాడు శ్రీవారికి నిర్వహించే వారపు కైంకర్యాల కారణంగా దర్శన సమయం తక్కువగా ఉన్నా కూడా తొలిసారి రికార్డు స్థాయిలో 79 వేల మందికి శ్రీవారి దర్శనం కల్పించడం టీటీడీ సామర్థ్యానికి నిదర్శనమన్నారు. ప్రతి గంటకు క్యూలైన్ల పరిస్థితిని ఉన్నతాధికారులు సమీక్షిస్తూ, అవసరమైన నిర్ణయాలను తక్షణమే అమలు చేయడం వల్ల దర్శన ప్రక్రియ మరింత వేగవంతమైందన్నారు.వేసవి రద్దీ నిర్వహణలో టీటీడీ విభాగాలతో పాటు విజిలెన్స్, పోలీసు శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయడం విశేష ఫలితాలను ఇచ్చిందని తెలిపారు. భక్తులకు తాగునీరు, అన్నప్రసాదాలు, వైద్య సేవలు, క్యూలైన్లలో సౌకర్యాలు నిరంతరాయంగా అందించేలా అన్ని విభాగాలు అప్రమత్తంగా పనిచేస్తున్నాయని చెప్పారు.సామాన్య భక్తులకు సౌకర్యవంతమైన, వేగవంతమైన దర్శనం కల్పించడమే టీటీడీ ప్రధాన లక్ష్యమని, ఇందుకోసం అధికార యంత్రాంగం అంకితభావంతో సేవలందిస్తోందని అదనపు ఈవో తెలియజేశారు.

## గోదావరి పుష్కరాలకు వైభవంగా ఏర్పాట్లు
## ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి

**- గోంగూరలంకను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు**



కొవ్వూరు (ప్రశ్న న్యూస్) గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని స్థాయిల్లో చర్యలు చేపడుతోందని రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి తెలిపారు.శుక్రవారం కొవ్వూరు నియోజకవర్గంలోని వాడపల్లి సమీప గోంగూరలంక ప్రాంతాన్ని స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ తదితర అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి మాట్లాడుతూ, గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి ముఖ్యమంత్రి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఘాట్ల ఆధునికీకరణ, రహదారుల విస్తరణ, యాత్రికులకు అవసరమైన సౌకర్యాల కల్పన వంటి అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు పేర్కొన్నారు. పుష్కరాల నిర్వహణకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, పనులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ముందుకు సాగాలని ముఖ్యమంత్రి సూచించినట్లు వెల్లడించారు.స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గోంగూరలంక ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పుష్కరాల సందర్భంగా దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు.జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ మాట్లాడుతూ, రెవెన్యూ, ఇరిగేషన్, పర్యాటక శాఖల సమన్వయంతో గోంగూరలంక ప్రాంతంలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించినట్లు తెలిపారు. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే అవకాశాలపై అధ్యయనం చేసి, అందుకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.ఈ పర్యటనలో టూరిజం ప్రాంతీయ సంచాలకులు ఎన్‌వీవీఎస్ఎన్ మూర్తి, గోదావరి హెడ్‌వర్క్స్ ఈఈ జి. శ్రీనివాసరావు, జిల్లా టూరిజం అధికారి పి. వెంకటచలం, తహసీల్దార్ డి. దుర్గాప్రసాద్, ఎంపీపి కాకర్ల నారాయుడు, స్థానిక నేతలు సూరపని సూర్య భాస్కర రామ్మోహన్, బేతిన నారాయణ, సుంకర సత్తిబాబు, బొడపాటి వెంకట ముత్యాలరావ్ , కాకర్ల బ్రహ్మాజీ, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శాశ్వత తాగునీటి పథకం పనులకు భూమి పూజ

**- జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**



పుట్టపర్తి(ప్రశ్న న్యూస్)నియోజకవర్గానికి సంబంధించి భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య లేకుండా చేసేందుకు శాశ్వత తాగునీటి పథకం పనులకు సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఎమ్మెల్యే సింధూర రెడ్డి భూమి పూజ నిర్వహించారు. శుక్రవారం కొత్తచెరువు సమీపంలోని బుక్కపట్నం చెరువు వద్ద ఆసియా ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంక్ సహకారంతో, జిందాల్ వాటర్ వర్క్స్ ఆధ్వర్యంలో పుట్టపర్తి మున్సిపాలిటీకి మంజూరైన రూ.136.26 కోట్ల శాశ్వత సమగ్ర త్రాగునీటి పథకం పనులకు వారు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2055 నాటి జనాభా (సుమారు 2 లక్షలు) అవసరాలకు అనుగుణంగా 90 లక్షల లీటర్ల నిల్వ సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును రూపకల్పన చేశారని, జిందాల్ సంస్థ ఆధ్వర్యంలో 2028 మే నాటికి పనులు పూర్తవుతాయన్నారు. పుట్టపర్తిలోని 11,700 కుళాయి కనెక్షన్ల ద్వారా ప్రతి ఇంటికి నాణ్యమైన తాగునీరు అందుతుందన్నారు. బుక్కపట్నం చెరువు పరిసరాలు పాపికొండలను తలపిస్తున్నాయని, ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ,పిహెచ్ డిఇ నరసింహ మూర్తి ,మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, జిందాల్ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గోషామహల్‌లో అక్రమ నిర్మాణాల రాజ్యం

**- అనుమతులు మించి అంతస్తులు, అక్రమ సెల్లార్లతో కోట్ల దందా**

**- నోటీసులు ఇవ్వరు కూల్చివేతలు చేయరు ఓన్లీ సెటిల్మెంట్**

**- అధికారుల జేబులు ఫుల్, జిహెచ్ఎంసి ఆదాయం నిల్**

**- జోనల్ కమిషనర్ జిహెచ్ఎంసి కమిషనర్ పట్టించుకోని వైనం**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గోషామహల్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. భవన నిర్మాణ అనుమతులు ఒకలా తీసుకుని, క్షేత్రస్థాయిలో మరోలా నిర్మాణాలు చేపడుతున్న బిల్డర్లకు కొందరు అధికారులు అండదండలు అందిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా అనుమతులు మించి అదనపు అంతస్తులు, నిబంధనలకు విరుద్ధంగా అక్రమ సెల్లార్లు నిర్మిస్తున్నా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## నోటీసులు కాదు.. సెటిల్మెంట్లే ముఖ్యం..

స్థానికుల ఆరోపణల ప్రకారం గోషామహల్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలపై నోటీసులు ఇవ్వడం, కూల్చివేతలు చేపట్టడం దాదాపు నిలిచిపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. జోరుగా అక్రమ నిర్మాణాలు కడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు ఫీల్డ్‌కి వెళ్లి పరిశీలించకుండా, "సెటిల్మెంట్" పేరుతో వ్యవహారాలు సాగిస్తున్నారని స్థానికుల నుండి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఒక్కో అదనపు అంతస్తుకు ఒక రేటు,గోషామహల్ సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికార శైలి అక్రమ సెల్లార్‌కు ప్రత్యేక రేటు ఫిక్స్ చేసి భారీగా వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

## సెక్షన్ ఆఫీసర్ మహేందర్ కనుసైగల్లో దందా.?

గోషామహల్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న అనేక అక్రమ నిర్మాణాల వెనుక సెక్షన్ ఆఫీసర్ మహేందర్ పేరు బలంగా వినిపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మంగల్ హాట్ లోని ప్రకాష్ థియేటర్ ముందు చిన్న వీధిలో ఎదురింటి నెంబర్ 13-1-12/10, భారీ అక్రమ నిర్మాణం అక్రమ సెల్లార్తో జరుగుతుందని ఇప్పటివరకు నోటీసులు కూడా ఇవ్వలేదు అంటే అధికారులకు ఎంత భారి స్థాయిలో లంచాలు అందాయో అర్థమవుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి నిర్మాణం తన అనుమతి లేకుండా జరగదని చెప్పుకుంటూ కొందరు బిల్డర్లతో కుమ్మక్కై అక్రమాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ కోట్లు గడిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని విమర్శలు ఉన్నాయి. అదనపు అంతస్తులు నిర్మిస్తున్నా, సెల్లార్లను కమర్షియల్ వినియోగానికి మార్చుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.ఏసీపీ బాల నంద స్వామిపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అక్రమ నిర్మాణాల వ్యవహారంలో ఏసీపీ బాల నంద స్వామి పాత్రపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా, పత్రికల్లో కథనాలు వస్తున్న పరిస్థితులు మారడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనుక భారీ స్థాయిలో అవినీతి జరుగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## జిహెచ్ఎంసి ఆదాయానికి భారీ గండి..

మున్సిపల్‌నిబంధనల ప్రకారం నిర్మాణాల నుండి వసూలు కావాల్సిన ఫీజులు, పెనాల్టీలు ప్రభుత్వ ఖజానాకు చేరకుండా మధ్యలోనే మాయమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించకుండా వదిలేయడంతో జిహెచ్ఎంసి ఆదాయానికి భారీగా గండి పడుతోందని దానితో జిహెచ్ఎంసి ఆదాయం పూర్తిగా తగ్గిపోయి అప్పుల పాలు అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఒకవైపు నగరంలో ట్రాఫిక్, పార్కింగ్, డ్రైనేజీ సమస్యలు పెరుగుతుండగా మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగడం ప్రజల్లో ఆగ్రహం రేపుతోంది.

## జిహెచ్ఎంసి విజిలెన్స్ పేరుకేనా.?

అక్రమ నిర్మాణాలపై విజిలెన్స్ విభాగం పూర్తిగా విఫలమైందనే



విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జోనల్ కమిషనర్ నుంచి కమిషనర్ స్థాయి వరకు ఫిర్యాదులు వెళ్లినా చర్యలు అసలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సాధారణ ప్రజలు చిన్న షెడ్ వేసుకున్నా నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేతలు చేస్తారు. కానీ కోట్ల విలువైన అక్రమ భవనాలపై మాత్రం మౌనం ఎందుకు.? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించే నా.?

గోషామహల్ సర్కిల్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఉన్నతస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలకు పాల్పడుతున్న బిల్డర్లతో పాటు వారికి సహకరిస్తున్న టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్, ఏసిపి అధికారుల ఆస్తులపై కూడా ఏసీబీ విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు. నగర అభివృద్ధిని కాపాడాలంటే అక్రమ నిర్మాణాల మాఫియాపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

# రోహిణి కార్తె కంటే ముందే మండుతున్న ఎండలు

**- ఏపీలో ఠారెత్తిస్తున్న ఎండలు**

**- ఉక్కపోతతో హైదరాబాద్ ఉక్కిరిబిక్కిరి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ వేడిమికి అనేక ప్రాంతాలు అగ్నిగుండంలా మారాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో వడదెబ్బ కారణంగా నిన్న 22 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు రావొద్దని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నిన్న పల్నాడు జిల్లాలో ఉష్ణోగ్రతలు 48 డిగ్రీలు దాటినట్లు వాతావరణ శాఖ తెలిపింది. పిడుగురాళ్ల వంటి చోట ఉష్ణోగ్రత అత్యధికంగా నమోదయింది. బాపట్ల జిల్లా వేటపాలెం, ప్రకాశం జిల్లా అద్దంకి తదితర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 47 డిగ్రీలు నమోదయ్యాయి. ఏపీలోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా, 150 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలంగాణలో రోహిణికార్తె కంటే ముందే ఎండలు మండిపోతున్నాయి. శుక్రవారం ఖమ్మం జిల్లాలో అత్యధికంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిజామాబాద్, ఆదిలాబాద్, హన్మకొండ, రామగుండం, భద్రాచలం తదితర ప్రాంతాల్లో 44 డిగ్రీలస ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలంగాణలోని దాదాపు అన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. హైదరాబాద్ నగర ప్రజలు వడగాలులు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. హైదరాబాద్ నగరంలో 42 నుంచి 43 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత నమోదైంది.

# ఎస్‌బీఐ ఉద్యోగుల సమ్మె వాయిదా

**- బ్యాంకింగ్ సేవలు యథాతథం!**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఉద్యోగులు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె వాయిదా పడింది. మే 25, 26 తేదీల్లో జరగాల్సిన ఈ సమ్మెను వాయిదా వేస్తున్నట్లు ఆల్ ఇండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ ఫెడరేషన్ ప్రకటించింది. బ్యాంకు యాజమాన్యంతో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు జరిపిన చర్చలు సఫలం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో దేశవ్యాప్తంగా ఎస్బీఐ బ్యాంకింగ్ కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం ఉండదని స్పష్టమైంది.ఈ నేపథ్యంలో, తమ కస్టమర్ల కోసం ఎస్బీఐ ఒక ప్రకటన విడుదల చేసింది. "ప్రతిపాదిత సమ్మె వాయిదా పడినందున, మే 25, 26 తేదీల్లో మా అన్ని బ్రాంచీలు యథావిధిగా పనిచేస్తాయి. అన్ని రకాల సాధారణ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉంటాయి" అని బ్యాంకు తన ప్రకటనలో పేర్కొంది. సిబ్బంది కొరత, శాశ్వత ఉద్యోగాలను ఔట్‌సోర్సింగ్ చేయడం, పెన్షన్ సంబంధిత సమస్యలు, వేతనాల్లో వ్యత్యాసాలు వంటి పలు కీలక అంశాలపై ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయి. తమ 16 డిమాండ్ల చార్టర్‌ను పరిష్కరించాలని కోరాయి. మెసెంజర్లు, ఆర్మ్‌డ్ గార్డుల నియామకం, ఖాళీ పోస్టుల భర్తీ, నేషనల్ పెన్షన్ సిస్టమ్ లో మార్పులు వంటివి వీటిలో ప్రధానమైనవి. సమ్మెకు ముందు దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని ఫెడరేషన్ భావించినప్పటికీ, యాజమాన్యంతో చర్చలు ఫలించడంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశారు. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఎస్బీఐ ఖాతాదారులు ఊరట చెందారు.

# హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ టోల్ వసూలు

**- స్పందించిన అమెరికా**



టెహ్రాన్ (ప్రశ్న న్యూస్) హర్మూజ్ జలసంధి వద్ద టోల్ వసూలు చర్యలను ఏ దేశం కూడా అంగీకరించకూడదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో అన్నారు. హర్మూజ్ మీదుగా ప్రయాణించే నౌకలపై టోల్ వసూలు చేయాలని ఇరాన్ యోచిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. దీనిపై అమెరికా స్పందించింది. ఇలాంటి వసూళ్లు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ నౌకా రవాణా మార్గాల్లో రాకపోకలను నిర్ణయించే హక్కు ఏ దేశానికి లేదని స్పష్టం చేశారు. హర్మూజ్ వద్ద స్వేచ్ఛాయుత నౌకాయానానికి ఎవరూ భంగం కలిగించలేరని అన్నారు. ఇరాన్ టోల్ వసూలు చేయాలని నిర్ణయిస్తే రెండు దేశాల మధ్య శాంతి చర్చలను మరింత సంక్లిష్టం చేసినట్లే అని పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిని దాటే నౌకల నుంచి పెద్ద మొత్తంలో టోల్ వసూలు చేయడం ప్రారంభమైందని ఇరాన్ అధికారిక మీడియా పేర్కొంది. ఈ క్రమంలో నౌకల యజమానులు, అందులో ఉన్న సరకు, అవి చేరుకోవాల్సిన గమ్యస్థానాల గురించి పూర్తి సమాచారాన్ని ఇరాన్ అధికారులకు ముందే తెలియజేయాల్సి ఉంటుందని పేర్కొంది. హర్మూజ్‌పై నియంత్రణ కోసం, అమెరికాతో యుద్ధం కారణంగా జరిగిన నష్టాన్ని ఈ టోల్ ద్వారా కొంత పూడ్చుకోనున్నట్లు తెలిపింది. అయితే ఇరాన్ నుంచి అధికారిక ప్రకటన మాత్రం రాలేదు.

# అమ్మో ఇన్ని అక్రమస్తులా

## ఏసీబీ వలలో డిప్యూటీ కలెక్టర్ కే. వంశీ మోహన్

**- 19 ప్లాట్లు, 2 ఎకరాల్లో ఫామ్ హౌస్ - వెలుగులోకి భూతందాల బాగోతం**

**- భారీగా ఆదాయానికి మించిన ఆస్తులు - ఉన్నత అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని ఇదే సాక్ష్యం**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రెవెన్యూ శాఖలో మరో భారీ అవినీతి తిమింగలం ఏసీబీ వలలో చిక్కింది. రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కలెక్టర్ కే. వంశీ మోహన్ నివాసాలు, కార్యాలయాలపై ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో భాగంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచే హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా 8 ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నాయి. ఈ సోదాల్లో వందల కోట్ల విలువైన అక్రమ ఆస్తులకు సంబంధించిన కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

### ప్రభుత్వ భూములే లక్ష్యంగా అక్రమాలు

వంశీ మోహన్ గతంలో శేరిలింగంపల్లితో పాటు పలు కీలక ప్రాంతాల్లో ఆర్డీవోగా పనిచేశారు. ఆ సమయంలో ఆయన తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడమే కాకుండా, భారీగా ఆస్తులు వెనకేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధిలోని పిగ్లీపురంలో సుమారు 8 ఎకరాల ఖరీదైన ప్రభుత్వ భూమిని కాజేసి, దాన్ని తన మామ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించినట్లు ఏసీబీ ప్రాథమికంగా గుర్తించింది. ఆ భూమిని తిరిగి ఒక రియల్టర్‌కు దారాదత్తం చేసి, అందులో భారీ లాభాలను ఆర్జించినట్లు ఆధారాలు లభ్యమయ్యాయి.

### రూ.4.46 కోట్ల విలువైన 19 ప్లాట్లు గుర్తింపు

ఈ సోదాల్లో వంశీమోహన్‌కు సంబంధించిన భారీగా ఆస్తులను గుర్తించారు. వనస్థలిపురం, మణికొండ, మజీద్‌కొండ ప్రాంతాల్లో రూ.4.46 కోట్ల విలువైన 19 ఓపెన్ ప్లాట్లు, రూ.1.2 కోట్ల విలువైన 3 ఇళ్లను గుర్తించారు. ఇబ్రహీంపట్నం పరిధిలోని నారపల్లి వద్ద 2 ఎకరాల్లో ఫామ్ హౌస్ ఉన్నట్లు గుర్తించారు. శేరిలింగంపల్లి, ఇతర ప్రాంతాల్లో వంశీమోహన్ ఆర్డీవోగా పనిచేశారు. ఆర్డీవోగా పని చేసిన సమయంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములను సొంతం చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అబ్దుల్లాపూర్‌మెట్, పిగ్లీపురంలో ఎనిమిది ఎకరాలు ఆక్రమించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. భూములను తొలుత తన మామ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి ఆ తర్వాత రియల్టర్లకు ధారాదత్తం చేసినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో ఒక రియల్టర్ నుంచి పది ప్లాట్లను గిఫ్ట్ డీడ్ చేయించుకున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఏసీబీ అధికారులు ఆయనను అరెస్టు చేశారు.

### రియల్టర్ల నుంచి గిఫ్ట్ డీడ్లు

భూముల మ్యుటేషన్లు, లేఅవుట్ల అనుమతుల విషయంలో రియల్టర్ల నుంచి వంశీ మోహన్ నగదు రూపంలోనే కాకుండా ప్లాట్ల రూపంలోనూ ముడుపులు అందుకున్నట్లు తెలుస్తోంది. ఒక ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ నుంచి సుమారు 10 ప్లాట్లను గిఫ్ట్ డీడ్ రూపంలో తన బంధువుల పేర్లపై తీసుకున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం వీటి విలువ కోట్లాది రూపాయల్లో ఉంటుందని అంచనా. శేరిలింగంపల్లి వంటి హై-డిమాండ్ ఏరియాలో పని చేసిన



కాలంలోనే ఈ అక్రమాలు ఎక్కువగా జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

### వందల కోట్ల సామ్రాజ్యం

సోదాల్లో ఇప్పటివరకు గుర్తించిన డాక్యుమెంట్ల ప్రకారం.. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఫ్లాట్లు, విల్లాలు, భారీగా వ్యవసాయ భూములు ఉన్నట్లు తేలింది. వీటి విలువ బహిరంగ మార్కెట్లో వందల కోట్లలో ఉంటుందని సమాచారం. వంశీ మోహన్ బంధువులు, బినామీల పేర్లపై ఉన్న ఆస్తులపై కూడా ఏసీబీ నజర్ పెట్టింది. బ్యాంక్ లాకర్లు తెరిస్తే మరిన్ని నగదు, బంగారు ఆభరణాలు బయటపడే అవకాశం ఉంది. డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి ఇంతటి భారీ స్థాయిలో భూదందాలకు పాల్పడటం రెవెన్యూ వర్గాల్లో కలకలం రేపుతోంది.

### కఠిన చర్యల దిశగా

ప్రభుత్వ భూముల పరిరక్షణలో కీలకంగా వ్యవహరించాల్సిన అధికారే భక్షకుడిగా మారడంపై ఏసీబీ తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ భూదందాల్లో వంశీ మోహన్‌కు సహకరించిన ఇతర అధికారులు, రాజకీయ నాయకుల వివరాలను కూడా ఏసీబీ సేకరిస్తోంది. పక్కా సమాచారంతోనే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు ఏసీబీ వర్గాలు తెలిపాయి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588